నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 27-11-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 104 పేజీలు: 4 వెల: రూ.1/-

సీఎం పదవికి ఫడణవీస్ రాజీనామా

ముంబై, నవంబర్ 26: ముఖ్యమంత్రి పదవికి బీజేపీ నేత దేవేంద్ర ఫడణవీస్ రాజీనామా చేశారు. డిప్యూటీ సీఎం పదవికి అజిత్ పవార్ రాజీనామా చేసిన నేపథ్యంలో ఫడణవీస్ మీడియా సమావేశం నిర్వహించారు. 'మహారాష్ట్ర ప్రజలు మహాయుతికే పట్టం కట్టారు. బీజేపీ సర్కార్‌కు ప్రజల ఆమోదం లభించింది. శివసేన కంటే బీజేపీకి ఎక్కువ స్థానాలు వచ్చాయి. 105 సీట్లతో బీజేపీ అతిపెద్ద పార్టీగా నిలిచింది. మేం శివసేనతో కలిసి పోటీ చేశాం. మేం పోటీ చేసిన సీట్లలో 70శాతం బీజేపీ గెలుపొందాం. కనుక ప్రజల మద్దతు తమకే ఉంది. శివసేన కోసం చాలా రోజులు వేచి చూశాం. కానీ వాళ్ల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. మాతో మాట్లాడకుండా కాంగ్రెస్-ఎన్సీపీలను సంప్రదించింది. రాజకీయ పరిణామాల తర్వాత రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు నా రాజీనామా లేఖ సమర్పిస్తా. ఎవరు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా వారికి నా శుభాకాంక్షలు తెలుపుతున్నా. కాకపోతే అలాంటి అస్థిర ప్రభుత్వం ఎంతోకాలం కొనసాగదని' ఫడణవీస్ పేర్కొన్నారు. నవంబర్ 23న ముఖ్యమంత్రిగా ఫడణవీస్.. అజిత్ పవార్ డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేశారు.

నేడే 'మహా' బలపరీక్ష

■ సాయంత్రం 5గంటల్లోపు బలపరీక్ష జరపాలి

- కీలక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు

■ ప్రొటెం స్పీకర్ సమక్షంలో బ్యాలెట్ విధానం ద్వారా ప్రక్రియ

■ బలపరీక్షను ప్రత్యక్షప్రసారం చేయాలి

■ రాజ్యాంగ నైతికతను అన్ని పక్షాలు కాపాడాల్సిన అవసరం ఉంది

■ కీలక వ్యాఖ్యలు చేసిన ధర్మాసనం

■ బలపరీక్షకు 15రోజులు గడువు కావాలనికోరిన బీజేపీ

■ నిరాకరించిన న్యాయస్థానం

■బలపరీక్షలో విపక్షాలదే గెలుపు - సోనియాగాంధీ

- సుప్రీం తీర్పుపై హర్షం వ్యక్తంచేసిన విపక్షాలు

న్యూఢిల్లీ, నవంబర్26(ఆర్ఎన్ఎ) : బీజేపీకి సర్వోన్నత న్యాయస్థానంలో చుక్కెదురైంది. మహారాష్ట్ర వ్యవహారాలపై సుప్రీంకోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. దేవేంద్ర ఫడ్నవీస్ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం బుధవారం సాయంత్రం ఐదు గంటలలోగా బలనిరూపణ చేసుకోవాలని స్పష్టం చేసింది. బహిరంగ బ్యాలెట్ విధానంలో పక్రియ పూర్తిచేయాలని స్పష్టంచేసిన సుప్రీంకోర్టు, ఈలోగా ప్రొటెం స్పీకర్‌ను నియమించాలని, బలపరీక్ష ఒక్కటే అజెండాగా సమావేశం జరగాలని సూచించింది. సభ్యుల ప్రమాణస్వీకారం అనంతరం బలపరీక్షను ప్రొటెం స్పీకర్ నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేగాక.. బలపరీక్షను ప్రత్యక్ష ప్రసారం చేయాలని న్యాయస్థానం పేర్కొంది. ప్రస్తుత పరిస్థితిలో రాజ్యాంగ నైతికతను అన్ని పక్షాలు కాపాడాల్సిన అవసరం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది.

బాజపా నేత దేవేంద్ర ఫడణవీస్ నేతృత్వంలోని ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ అవకాశం ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్, ఎన్సీపీ, శివసేన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి. రమణ, జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం ఎదుట సోమవారం వాదనలు ముగిశాయి. దీంతో మంగళవారం తీర్పు వెలువరించింది.

బలాబలాలు ఇలా..

మహారాష్ట్ర అసెంబ్లీలో మొత్తం 288 స్థానాలున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాల్లో భాజపా 105 స్థానాల్లో గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించింది. శివసేనకు 56, కాంగ్రెస్‌కు 44, ఎన్సీపీకి 54 సీట్లు వచ్చాయి. మరో 29 చోట్ల చిన్న పార్టీ లు, ఇతరులు గెలుపొందారు. అయితే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 145 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఎన్నికల్లో ఎన్డీయే కూటమితో కలిసి పోటీ చేసిన శివసేన ఫలితాల తర్వాత భాజపాతో విబేధాలు రావడంతో కూటమి నుంచి విడిపోయింది. అనంతరం ఎన్సీపీ, కాంగ్రెస్‌తో చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అనూహ్య పరిణామాలు చోటుచేసుకుని ఎన్సీపీ నేత అజిత్ పవార్ మద్దతుతో దేవేంద్ర ఫడణవీస్ నేతృత్వంలో భాజపా సర్కార్ ఏర్పడింది. దీంతో శివసేన, కాంగ్రెస్, ఎన్సీపీలు సుప్రీం తలుపుతట్టాయి.

సుప్రీం తీర్పు నేపథ్యంలో బుధవారం బలపరీక్ష జరగనుంది. ఈ సందర్భంగా పార్టీల బలాబలాలను పరిశీలిస్తే.. ఎన్సీపీ, స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో తమకు 170 మంది సంఖ్యాబలం ఉందని భాజపా చెబుతోంది. అయితే శివసేన -కాంగ్రెస్-ఎన్సీపీ త్రయం కూడా తమకు 162 మంది ఎమ్మెల్యేల మద్దతుందని చెప్పింది. సోమవారం ఈ మూడు పార్టీలు సంయుక్తంగా సమావేశమై.. 162 మంది ఎమ్మెల్యేలతో బలప్రదర్శన చేశాయి. ఇదిలాఉంటే ఎన్సీపీ శాసనసభాపక్ష నేతగా అజిత్ పవార్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నుకొన్నారు. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాల దృష్ట్యా అజిత్‌ను ఆ పదవి నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో అజిత్‌కు విప్ జారీచేసే అవకాశం ఉందా లేదా అనే దానిపై సందిగ్ధత నెలకొంది. మరి బల పరీక్షలో భాజపా నెగ్గుతుందో.. ఎన్సీపీ ఎమ్మెల్యేల ఓటు ఎటో తెలియాలంటే బుధవారం సాయంత్రం వరకు ఆగాల్సిందే.

సుప్రీం తీర్పు చరిత్రాత్మకం - సోనియా గాంధీ

మహారాష్ట్ర అసెంబ్లీలో దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వం మంగళవారం సాయంత్రం ఐదు గంటల్లోగా బలనిరూపణ చేసుకోవాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ స్వాగతించారు. సుప్రీం కోర్టు తీర్పు చరిత్రాత్మకమని అభివర్ణించారు. బలపరీక్షలో విపక్షాలదే విజయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఇక సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని శివసేన పేర్కొంది. ఇది ప్రజాస్వామ్య విజయమని తెలిపింది. సుప్రీం ఉత్తర్వులతో శివసేన శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సుప్రీం తీర్పు అనంతరం ఖేల్ ఖతం అంటూ ఆ పార్టీ నేత నవాబ్ మాలిక్ ట్వీట్ చేశారు.

ప్రొటెం స్పీకర్ కోసం ఆరుగురి పేర్లు ప్రతిపాదన..

మహారాష్ట్ర అసెంబ్లీలో బుధవారమే బలపరీక్ష నిర్వహించాలని సుప్రీం కోర్టు ఆదేశించిన నేపథ్యంలో ప్రొటెం స్పీకర్‌గా ఎవరిని నియమించాలన్న దానిపై తర్జన భర్జన కొనసాగుతోంది. ప్రొటెం స్పీకర్ పదవి కోసం ప్రస్తుత ప్రభుత్వం.. ఆరుగురి పేర్లను ప్రతిపాదించింది. ఆ ఆరుగురి పేర్లను గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీకి పంపించారు. రాధాక అష్ణ వైఖే పాటిల్(బీజేపీ), కాళిదాస్ కోలంబ్కర్(బీజేపీ), బాబన్‌రావు ఖికాజీ(బీజేపీ), బాలసాహెబ్ థోరత్ (కాంగ్రెస్), కేసీ పద్వి(కాంగ్రెస్), దిలీప్ వాల్సే పాటిల్(ఎన్సీపీ) పేర్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. వీరిలో అత్యంత సీనియర్లు.. బాలసాహెబ్ థోరత్, కాళిదాస్ కోలంబ్కర్. సభలో అత్యంత సినీయార్టి ఉన్న వారికే ప్రొటెం స్పీకర్ పదవిని అప్పజెప్పడం జరుగుతుంది. ఈ ఆరుగురిలో ఒక్కరి పేరును గవర్నర్ ఖరారు చేసే అవకాశం ఉంది. ప్రోటెమ్ స్పీకర్ అంటే తాత్కాలిక స్పీకర్. అధికారిక స్పీకర్ ఉండడు కాబట్టి.. బలపరీక్షకు కావాల్సిన తతంగం అంతా ఆయన చేతులమీదుగానే సాగాల్సి ఉంటుంది. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఇచ్చిన లేఖ ప్రకారం.. గవర్నర్ ప్రోటెమ్ స్పీకర్‌ను నియమించడం జరుగుతుంది. బుధవారం సాయంత్రం 5 గంటల లోపే బల నిరూపణ జరగాలని సుప్రీం కోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. ఇప్పుడు కీలక బాధ్యతలన్నీ ప్రోటెమ్ స్పీకర్ ఆధీనంలోనే ఉంటాయి.

అల్బేనియాలో భారీ భూకంపం సంభవించడంతో కుప్పకూలిన భవనాలు

అల్బేనియాలో భారీ భూకంపం

న్యూఢిల్లీ,నవంబర్26(ఆర్ఎన్ఎ): అల్బేనియాలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 6.4గా నమోదు అయ్యింది. గత రెండు నెలల్లో శక్తివంతమైన భూ ప్రకంపనలు చోటుచేసుకోవడం ఇది రెండోసారి అని యూఎస్ జియోలాజికల్ సర్వే పేర్కొన్నది. అల్బేనియా రాజధాని తిరానాతో పాటు తీర ప్రాంత నగరం దురెస్‌లో భూకంప ధాటికి బిల్డింగ్‌లు కుప్ప కూలాయి. సుమారు రెండు భారీ భవంతులు నేలమట్టం అయ్యాయి. తిరానకు 30 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నది. శిథిలాల కింద చిక్కుకున్నవారిని ఆర్మీ రక్షిస్తున్నది.

చరిత్రలో నేటినిజం



కం॥ 'యిక్కుడుగ 'మార్షలార్టు'ను
'నక్కెసుఫుల్' చౌడుగాడి సామానికునిగా
ఫిక్కులు పోయిన బ్రూస్లీ
వెక్కిలి పోయిన ప్రజలకు వేళ్ళ నిలచెనే!!

(నవంబర్ 27 బ్రూస్లీ జననం)

-రాధశ్రీ

సెల్: 9494481210

యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

బస్సు-ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో 9మంది మృతి

లక్నో,నవంబర్26(ఆర్ఎన్ఎ): ఉత్తర ప్రదేశ్‌లోని బండ జిల్లాలో సోమవారం రాత్రి పది గంటల ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బస్సు-ట్రక్కు ఢీకొని 9 మంది మృతి చెందగా 15 మంది త్రీవంగా గాయపడ్డారు. యుపిఆర్‌టిసి అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతులకు ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ తెలిపారు. మృతులకు సంతాప తెలిపడంతో మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. బస్సు బండ నుంచి ఫతేపూర్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు సమచారం. గాయపడిన వారికి 2.5 లక్షలు రూపాయలు ఇస్తామని సిఎం ప్రకటించారు.

మరోమారు యాదాద్రి సందర్శనకు సిఎం కెసిఆర్

పనుల పూర్తిపై చినజీయర్‌తో కలసి పరిశీలన

త్వరలోనే పర్యటన ఖరారు

యాదాద్రి,నవంబరు 26(ఆర్ఎన్ఎ): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానం అభివృద్ధి పనులను పరిశీలించేందుకు సీఎం కేసీఆర్ త్వరలో యాదాద్రికి రానున్నట్టు తెలిసింది. చినజీయర్ స్వామితో కలిసి గుట్టను సందర్శించే సీఎం కేసీఆర్ అభివృద్ధి పనులు ఎంత మేరకు పూర్తయ్యాయి, సుదర్శన హోమం, ఆలయ ప్రారంభం తదితర అంశాలను చర్చించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. అయితే చినజీయర్ స్వామికి ఉన్న బిజీ షెడ్యూల్ కారణంగా తేదీలు ఖరారు చేసుకుని వచ్చే అవకాశాలు ఉన్నట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. యాదాద్రి ఆలయాన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించనున్నట్టు సిఎం కెసిఆర్ ఇప్పటికే పేర్కొన్న విషయం విధితమే. సీఎం కేసీఆర్ మాత్రం చినజీయర్‌స్వామిని కలుసుకుని వీటిపై చర్చలు జరిపిన అనంతరమే ముహూరం ఖరారు చేయనున్నట్టు సమాచారం. యాదాద్రి ఆలయ ప్రారంభోత్సవంపై సీఎం కేసీఆర్ త్వరలో చినజీయర్‌స్వామిని కలుసుకోనున్నట్టు తెలిసింది. ఫిబ్రవరిలో ఆలయ ప్రారంభోత్సవం, 1008 హోమగుండాలతో సుదర్శనహోమం, అదే విధంగా వీఐపీ సూట్స్ వంటి ప్రారంభోత్సవాలపై సుదీర్ఘంగా చర్చించనున్నట్టు సమాచారం. కాగా, సుదర్శన హోమాన్ని నిర్వహించేందుకు వేదపండితులు ఎవరిని పిలవాలి అనే అంశంపై కూడా ప్రధానంగా చర్చించి ఓ నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. వీటన్నింటిపై ఓ సమగ్ర నివేదిక పొందుపర్చుకున్న తర్వాతనే సీఎం వీలుంటే చినజీయర్‌స్వామితో కలిసి ఆలయాన్ని సందర్శిస్తారని విశ్వసనీయంగా తెలిసింది. సీఎం కేసీఆర్ యాదాద్రికొండను సందర్శించనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పనులను వేగి రం చేశారు. యాదాద్రి ప్రధానాలయ పునర్నిర్మాణ పనులు ఇప్పటికే 90 శాతం మేర పూర్తయ్యాయి. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా పాత వైకుంఠద్వారం తొలగించి నూతనంగా నిర్మాణం చేశారు. అదే విధంగా భక్తులు కొండపైకి వెళ్లడానికి అనుగుణంగా నూతన మెట్ల దారిని కూడా ఏర్పాటు చేశారు. వాటి పనులు కూడా త్వరలో పూర్తి కానున్నాయి. అంతేకాదు గర్భాలయంలో కూడా వైటీడీఏ వైస్ చైర్మెన్ కిషన్‌రావుతో పాటు అధికారులు జరుగుతున్న పనులపై ఎ ప్పటికప్పుడు సమీక్షలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

అమెరికాలో దారుణం

తెలంగాణ విద్యార్థినిపై అత్యాచారం..హత్య

హైదరాబాద్,నవంబర్26(ఆర్ఎన్ఎ): అమెరికాలో భారత్‌కు చెందిన టీనేజ్ యువతి దారుణంగా హత్యకు గురైంది. యూనివర్సిటీ ఆఫ్ ఇలియనాస్‌లో చదువుతున్న 19 ఏళ్ల రూత్ జార్జ్‌ను ఆగంతకుడు అత్యాచారం చేసి.. ఆ తర్వాత హత్య చేసినట్లు డాక్టర్లు నిర్ధారించారు. నవంబర్ 23వ తేదీన ఈ హత్య జరిగింది. రూత్ జార్జ్ మృతదేహాన్ని యూనివర్సిటీలో ఉన్న గ్యారేజీలో గుర్తించారు. తన కారులోనే యువతి శవమై కనిపించింది. ఈ హత్య కేసులో 26 ఏళ్ల డోనాల్డ్ తుర్‌మాన్‌ను దోషిగా తేల్చారు. నిందితుడిపై ఫస్ట్ డిగ్రీ మర్డర్ కేసును నమోదు చేశారు. లైంగికదాడి కింద కూడా కేసును బుక్ చేశారు. రూత్ పేరెంట్స్‌ది హైదరాబాద్ అని ప్రాథమికంగా తెలుస్తోంది.

28న కేబినేట్ భేటీ

ఆర్టీసీ సమస్యపై చర్చించే అవకాశం

హైదరాబాద్,నవంబరు 26 (ఆర్ఎన్ఎ): ఈ నెల 28న మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన ప్రగతి భవన్‌లో ఈ భేటీ కొనసాగనుంది. 29వ తేదీన కూడా మంత్రివర్గ సమావేశం జరిగే అవకాశం ఉంది. ఈ కేబినెట్ భేటీలో ఇతర అంశాలతో పాటు ఆర్టీసీ అంశంపైనే ప్రధానంగా చర్చించనున్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఆర్టీసీ సమస్యను ముగించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నారు. ఆర్టీసీ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కేబినెట్ భేటీలో సుదీర్ఘంగా చర్చించి ఓ నిర్ణయం తీసుకోనున్నారు.

ఇంకెంతమంది బలిదానాలు చేసుకోవాలి

కార్మికులను ఎందుకు విధుల్లోకి తీసుకోరు: రేవంత్

హైదరాబాద్,నవంబరు 26(ఆర్ఎన్ఎ): ఇంకెంతమంది ఆర్టీసీ కార్మికులు బలిదానాలు చేసుకోవాలని కాంగ్రెస్ నేత,మల్కాజిగిరి ఎంపి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సమ్మె విరమించినా వారిని విదుల్లోకి చేర్చుకోక పోవడంలో ఆంతర్యమేమిటన్నారు. తెలంగాణలో ఆర్టీసి సమ్మె 52 రోజులపాటు సాగింది. అయితే సమ్మె విరమించి విధుల్లో చేరేందుకు కార్మికులు ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. కాగా కార్మికులను విధులకు రానివ్వకుండా ప్రభుత్వం అడ్డుకుంటున్న విషయంపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ విమర్శించారు. నియంతృత్వం, దుర్మార్గ పాలనకు పరాకాష్ఠగా ప్రభుత్వం మారిందన్నారు. ఇంకా ఎంత మంది చనిపోతే మీ రక్తదాహం తీరుతుంది? చనిపోయిన ముప్పై మంది కార్మికుల కుటుంబాల ఉసురు తగులుతుందని అన్నారు. ఆర్టీసి కార్మికులను బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మహారాష్ట్రలో బీజేపీ అనుసరిస్తున్న పద్ధతి అప్రజాస్వామికమైనదని కాంగ్రెస్ నేత వి.విమర్శించారు. గవర్నర్ బీజేపీకి అనుకూలంగా పనిచేశారని, ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని చూస్తోందన్నారు. దేశం ఎటుపోయినా వర్వాలేదు కానీ, తాము మాత్రం అధికారంలో ఉండాలని బీజేపీ కోరుకుంటోందని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై కోర్టు అనుకూలంగా తీర్పు రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, శివసేన, ఎన్సీపీ పార్టీలు కలిసి ఖచ్చితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

26/11 అమరులకు ఘన నివాళులు

- నివాళులర్పించిన రాష్ట్రపతి, ఉపరాష్ట్ర పతి

న్యూఢిల్లీ, నవంబర్26(ఆర్ఎన్ఎ) : ముంబయి మారణహోమానికి నేటితో 11ఏళ్లు. భారత సైనికుల చేతికి చిక్కిన ఉగ్రవాది కసబ్ సహా 10మంది ముష్కరులు జరిపిన నరమేధం దేశ చరిత్రలో మరపురాని దుర్ఘటన. ఈ నెత్తుటి మరకలకు 11ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నేడు ఆనాటి అమరుల జ్ఞపకాలను స్మరించుకుంటున్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, సహా పలువురు ముఖ్యనేతలు వారికి నివాళులర్పించారు. ఈ మారణహోమంలో ప్రాణాలు కోల్పోయివారి త్యాగాలను ఈ దేశం ఎప్పటికీ స్మరించుకుంటుందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వ్యాఖ్యానించారు. ఉగ్రవాద నిర్మూలనకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. అలాగే ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు స్పందిస్తూ 2008లో ముంబయి ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ నా హృదయపూర్వక శ్రద్ధాంజలి ఘటిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా దేశాన్ని కాపాడటంలో ప్రాణత్యాగం చేసిన భద్రతా బలగాలకు నివాళులర్పిస్తున్నాను. వారి త్యాగాలను దేశం ఎన్నటికీ మరవదని వారి త్యాగాలను గుర్తుచేసుకున్నారు. అలాగే మహారాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ముంబయిలోని పోలీసుల స్మారకం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మహారాష్ట్ర ఉన్నతాధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

రాజ్యాంగమే మన పవిత్ర గ్రంథం

- కోట్లమంది కలిసి ఉండడానికి రాజ్యాంగమే కారణం

- ప్రధాని నరేంద్ర మోదీ

- ప్రతిఒక్కరూ మాతృభాషను గౌరవించాలి

- ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

న్యూఢిల్లీ, నవంబర్26(ఆర్ఎన్ఎ) : రాజ్యాంగమే మన పవిత్ర గంథమని, కోట్ల మంది భారతీయులు కలిసి మెలిసి ఉండటానికి డా. బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే కారణమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మంగళవారం భారత దేశం రాజ్యాంగాన్ని ఆమోదించి 70ఏళ్లు నిండిన సందర్భంగా పార్లమెంట్‌లో ఉభయసభలు ప్రత్యేకంగా సమావేశం అయ్యాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, లోకసభ స్పీకర్ ఓం బిర్లా సహా కేంద్ర మంత్రులు, ఉభయ సభల సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడారు. జ్ఞానానికి మహా కేంద్రంగా పార్లమెంట్ విలసిల్లుతోందన్నారు. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌ను ప్రధాని మోదీ గుర్తు చేశారు. ఇది పార్లమెంట్‌లో చరిత్రాత్మక దినమన్నారు. మన రాజ్యాంగమే మనకు పవిత్ర గ్రంథమన్నారు. ఆ గ్రంథమే మన జీవితాలను, మన సమాజాన్ని, మన సాంప్రదాయాలను, నమ్మకాలను ప్రస్ఫుటిస్తుందన్నారు. కొత్తగా ఎదురవుతున్న సవాళ్లను కూడా ఆ గ్రంథం పరిష్కరిస్తుందన్నారు. రాజ్యాంగంలో పౌరుల హక్కులు, బాధ్యతలు ఉంటాయని, ఇదే మన రాజ్యాంగ విశిష్టత అని ఆయన తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన బాధ్యతలను మనం ఎలా నెరవేర్చాలన్నదానిపై దృష్టిపెట్టాలన్నారు. మన బాధ్యతలను సంపూర్ణంగా, సక్రమంగా నిర్వర్తించడమే మన హక్కు అని గాంధీజీ అన్నట్లు మోదీ గుర్తు చేశారు. ప్రపంచం అంతా హక్కుల గురించి మాట్లాడుతుంటే, గాంధీజీ మాత్రం ఓ అడుగు ముందుకేసి పౌరుల బాధ్యతలను గుర్తుచేశారని అన్నారు. ఈ సందర్భంగా 2008లో జరిగిన ముంబై ఉగ్రదాడిలో చనిపోయినవారికి ప్రధాని మోదీ తన ప్రసంగంలో నివాళి అర్పించారు.

మాతృభాషను ప్రతిఒక్కరూ గౌరవించాలి- ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

అమ్మ భాష కళ్లలాంటిదని.. ఇతర భాషలు కళ్లజోడులాంటివని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పార్లమెంటులో తెలుగులో వ్యాఖ్యానించారు. ప్రతిఒక్కరూ మాతృభాషను గౌరవించాలని..దాని పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తొలుత మాతృభాష, తరవాత ఇతర భాషలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆయన పార్లమెంటులో జరిగిన ఉభయ సభల సంయుక్త సమావేశంలో మాట్లాడారు. అలాగే రాజ్యాంగ విశిష్టతను వివరించారు. అవసరానికి అనుగుణంగా మన రాజ్యాంగ ఔన్నత్యాన్ని పదిలపరచుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగా ఇప్పటి వరకు రాజ్యాంగాన్ని 103సార్లు సవరించిన విషయాన్ని గుర్తుచేశారు. సుదీర్ఘ మథనం ద్వారా అంబేద్కర్ రాజ్యాంగాన్ని తీర్చిదిద్దారన్నారు. మన రాజకీయ ప్రజాస్వామ్యం సామాజిక ప్రజాస్వామ్యంగా ఉండాలని అంబేద్కర్ ఆశించారన్నారు. పరిపాలనలోనూ అనేక మార్పులు తీసుకొస్తున్నామన్నారు. మన పనులు, జీవితంలో సృజనాత్మకత భాగంగా ఉండాలని వెంకయ్య సూచించారు.

విపక్షాలు దూరంగా..

కాగా.. పార్లమెంట్‌లో జరుగుతున్న రాజ్యాంగ దినోత్సవానికి విపక్షాలు దూరంగా ఉన్నాయి. మహారాష్ట్ర పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష నేతలు ఈ కార్యక్రమానికి హాజరుకాకుండా నిరసనకు దిగాయి. 'రాజ్యాంగాన్ని పరిరక్షించండి' అని ప్లకార్డులు చేతబట్టి పార్లమెంట్ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ఆందోళన చేపట్టాయి. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ రాజ్యాంగాన్ని చదువుతూ నిరసన వ్యక్తం చేశారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రమాణం చేస్తున్న సిఎం కెసిఆర్, గవర్నర్ తమిళ సై, హైకోర్టు సిజె రాఘవేందర సింగ్ చౌహాన్

దేశ, రాష్ట్ర హక్కుల రక్షణ మన బాధ్యత

- రాజ్యాంగం గురించి యువత సంపూర్ణంగా తెలుసుకోవాలి

- సంక్షేమ పథకాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలవాలి

- రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో గవర్నర్ తమిళిసై

- భారతదేశానిది డైనమిక్ రాజ్యాంగం

- తెలంగాణ సీఎం కేసీఆర్

హైదరాబాద్, నవంబర్26(ఆర్ఎన్ఎ) : దేశ, రాష్ట్ర హక్కులను పరిరక్షించుకోవడం ప్రజల బాధ్యత అని తెలంగాణ గవర్నర్ తమిళిసై అన్నారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో మంగళవారం నిర్వహించిన 70వ రాజ్యాంగ వార్షిక దినోత్సవ వేడుకల్లో పాల్గొని ఆమె ప్రసంగించారు. నేడు రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఎన్నాళ్లు బతుకుతున్నామో కాదు.. ఎలా బతుకుతున్నామన్నదే ముఖ్యమని ఆమె తెలిపారు. రాజ్యాంగ ప్రతినిధులంతా ఇక్కడ ఉన్నారని, దేశంలోని ప్రతి పౌరుడికి మన రాజ్యాంగం రక్షణ కల్పిస్తోందని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన రక్షణ యువతకు చాలా వరకు తెలియదని, రాజ్యాంగం గురించి యువత సంపూర్ణంగా తెలుసుకోవాలని గవర్నర్ అన్నారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. తెలంగాణ గౌరవాన్ని అత్యున్నత స్థితిలో నిలుపుదామని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు రాజ్యాంగం అవకాశం కల్పిస్తోందని అన్నారు. భారతదేశానిది డైనమిక్ రాజ్యాంగమని, అనేకసార్లు మార్పులు, చేర్పులు జరిగాయని సీఎం గుర్తు చేశారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు రాజ్యాంగం అవకాశం కల్పిస్తోందన్నారు. రాజ్యాంగం ఏడు దశాబ్దలుగా పరిపుష్టంగా కొనసాగుతోందని, రాజ్యాంగ స్ఫూర్తితో మన కర్తవ్యాన్ని నిర్వహించుకుందామన్నారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. అనంతరం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆర్.ఎస్.చౌహాన్ మాట్లాడుతూ.. రాజ్యాంగంలో పేర్కొన్న మూడు వ్యవస్థలకు కీలక బాధ్యతలు ఉన్నాయని అన్నారు. జాతి పునర్ నిర్మాణానికి మన మంతా ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశం ఏం చేసిందనే దాని కన్నా..మనం ఏం చేస్తున్న

నేటినిజం
బుధవారం 27-11-2019

ఇది 'ప్రపంచీకరణ' మాయ!

ప్రభుత్వేతర సంస్థల, ప్రధానంగా మన దేశం పట్ల మక్కువ లేని విదేశీయ 'బహుళ జాతీయ వాణిజ్య సంస్థల' ఆధిపత్యం మొదలైంది. ఈ విదేశీయ సంస్థలు కేవలం వ్యాపారం చేయడం లేదు, పారిశ్రామిక కలాపాలను సాగించడం లేదు, ఈ జాతి జీవన అస్తిత్వ స్వభావాన్ని చెఱచివేశాయి. 'ప్రపంచీకరణ' మొదలైన తరువాత ఈ పాతికేళ్లలో మన ప్రజల సమష్టి జీవన స్వభావం వికృతమైపోయిందన్న ధ్యాస కూడ లేకపోవడం 'ప్రపంచీకరణ' సృష్టించిన మాయ! ఇది మొదటి వైపరీత్యం. ప్రభుత్వ పాలనకు సమాంతరంగా విదేశీయ వాణిజ్య సంస్థల ఆర్థిక బీభత్సపాలన కొనసాగుతోంది. ఇది రెండవ వైపరీత్యం! విత్తనాల నుంచి మొబైల్ ఫోన్ల వరకు, 'అంతర్జాల' సరఫరా నుంచి అప్పడాల ఉత్పత్తి వరకు అన్ని జీవన రంగాలలోను విదేశీయ సంస్థలు మన నిత్యవ్యవహారాన్ని నియంత్రిస్తున్నాయి. ఇదంతా మనకు మళ్లీ సంప్రాప్తించి ఉన్న ఆర్థిక బానిసత్వం, సాంస్కృతిక బానిసత్వం. రెండేళ్ల శిశువు పుట్టినరోజు పండుగను ఇళ్లలో జరపడం లేదు, స్టార్ హోటళ్లలో జరుపుతున్నారు! 'స్టార్ హోటళ్లు' ప్రపంచీకరణ పతాకాలు!! ప్రభుత్వపు ఆస్తులను, ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వేతరుల కబంధ బంధానికి అప్పగిస్తుండడం 'ప్రపంచీకరణ'లో భాగం! వికేంద్రీకృతం చేయడం లేదు.. ఇంకా ఇంకా కేంద్రీకరణను పెంచుతున్నారు. రెండు, మూడు, నాలుగైదు ప్రభుత్వరంగపు 'బ్యాంకుల'ను విలీనం చేసి ఒకే పెద్ద బ్యాంకుగా మార్చడం మరింత కేంద్రీకరణకు ఒక ఉదాహరణ మాత్రమే!!నరేంద్ర మోదీ ప్రధానమంత్రిత్వంలోని భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం మన్‌మోహన్ సింగ్ ప్రధానమంత్రిత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నాటి ఆర్థిక విధానాలను కొనసాగిస్తుండడం జాతీయ వైపరీత్యం. దేశ హితానికి ప్రజల సమష్టి ప్రయోజనానికి దోహదం చేయగల అన్ని అంశాల గురించి ప్రధాన రాజకీయ పక్షాలు ఏకాభిప్రాయం కలిగి ఉండాలి! "కలిగి ఉండాలన్నది" పరిణత ప్రజాస్వామ్య రాజ్యాంగ సంప్రదాయం! కానీ దేశ హితానికి, ప్రజల సమష్టి ప్రగతికి వ్యతిరేకమైన ఆర్థిక నీతి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ కాలం నాటి విధానం పట్ల ప్రస్తుత భాజపా' ప్రభుత్వం తన అంగీకారాన్ని గత ఐదేళ్లకు పైగా ఆవిష్కరిస్తోంది. ఇదీ విచిత్రం! 'ప్రపంచీకరణ', బహుళ జాతీయ వాణిజ్య సంస్థల చొఱబాటు, స్వేచ్ఛా వాణిజ్య వ్యవస్థ– మార్కెట్ ఎకానమీ– వంటివి మన దేశాన్ని ఆర్థికంగా పీల్చిపిప్పిచేస్తున్నాయి. కానీ పాతికేళ్లకు పైగా ఈ వైపరీత్యాలు తొలగక పోవడమేకాక మరింతగా పాతుకొని పోతున్నాయి. ప్రభుత్వపు ఆస్తులను అమ్మిపారేస్తుండడం ఇందుకు ఒక నిదర్శనం మాత్రమే! ఈ అమ్మకాలకు 'డిస్‌ఇన్వెస్ట్‌మెంట్' అని ముద్దుపేరు పెట్టారు. ఈ మన్‌మోహనీయ అంతర్జాతీయ ఆర్థిక నీతిని గతంలో అటల్ బిహారీ వాజపేయి ప్రధానమంత్రిత్వంలో భాజపా' ప్రభుత్వం అమలు జరిపింది, అమ్మకాల మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. ఇప్పుడు నరేంద్రమోదీ ప్రధానమంత్రిత్వంలోని ప్రభుత్వం కూడ మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వం విధానాలనే కొనసాగిస్తోంది. అందువల్లనే ప్రభుత్వానికి చెందిన వాణిజ్య పారిశ్రామిక సంస్థలను, సేవాసంస్థలను అమ్మిపారేస్తున్నారు.. ఇలా అమ్మకాల ద్వారా లభిస్తున్న నిధులను ప్రత్యేకంగా ఉంచి, ఆ 'పెట్టుబడి'ని వివిధ రంగాలలో 'అంకుర' పరిశ్రమలను, భారత్‌లో నిర్మించండి' పథకాలను పెంపొందించడానికి వాడవచ్చు! కానీ గతంలో ఈ విక్రయ ధనాన్ని ఆదాయంగా జమకట్టుకోవడం చరిత్ర. దీనివల్లనే మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వం దేశాన్ని 'దివాలా'దిశగా నడిపించింది! మరి ఇప్పుడు ఈ విక్రయ ధనాన్ని ఏమి చేస్తారు? జాతీయత, దేశ సార్వభౌమ అధికార పరిధులలో ప్రభుత్వేతర సంస్థలు కూడ ప్రగతి ప్రక్రియలో భాగస్వాములు కావచ్చు! కానీ 'జాతీయత'కు, మన దేశపు సార్వభౌమ అధికార పరిధికి కట్టుబడని, మన దేశం పట్ల మమకారం లేని 'బహుళ జాతీయ సంస్థల'కు సైతం ప్రభుత్వపు ఆస్తులను విక్రయించడం వల్ల మన ఆర్థిక స్వాతంత్ర్యం హరించుకొని పోతోంది. ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగ భాగస్వామ్యం– పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్– పేరుతో ప్రభుత్వరంగ సంస్థలలోని సగం కంటె తక్కువ భాగస్వామ్యాన్ని ప్రభుత్వేతరులకు గతంలో కట్టబెట్టారు! ఇప్పుడు దివాలా దిశగా మరింత ముందుకు వెడుతున్నారు! ప్రభుత్వ రంగ సంస్థలను మొత్తంగా ప్రభుత్వేతరులకు కట్టబెడుతున్నారు.. అంతే..! ఈ మతలబులు అర్థం కాని జనం దిక్కుతోచక ఉండిపోవడం తప్ప ఏమి చేయగలరు?

విద్యార్థుల ఆరోగ్యంపై కదిలిన యంత్రాంగం

సత్ఫలితాలు ఇవ్వనున్న నీటిగంట

అందుకు తగ్గట్లుగా చర్య తీసుకోవాలి

హైదరాబాద్,నవంబర్26(ఆర్ఎన్ఎ): విద్యార్థులకు సకాలంలో నిత్యం నీళు అందించకుంటే అనారోగ్యం పాలవుతారన్న వైద్యుల సూచనల మేరకు ప్రభుత్వాలు ఇటీవల చర్యలకు ఉపక్రమించారు. స్కూళ్లలో ఇందుకు ప్రత్యేకంగా నీటి గంట సమయాలు నిర్దారించారు. పిల్లలు కనీసం రోజుకు రెండు నుంచి మూడు లీటర్ల నీటిని తాగాల్సి ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. కానీ పాఠశాలల్లో అధిక శాతం మంది విద్యార్థులు రోజుకు అర లీటరు నీటిని కూడా తాగడం లేదు. నీటిని తగిన రీతిలో తాగాలన్న అవగాహన లేకపోవడం, పాఠశాలల్లో ఎక్కువగా నీరు తాగితే తరచూ మరుగుదొడ్లకు వెళ్లాల్సి వస్తుందన్న బెంగ, ఎడతెరిపి లేకుండా తరగతుల నిర్వహణ వంటి కారణాలు విద్యార్థులపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో పిల్లలు త్వరగా డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. మూత్రపిండాల్లో రాళ్లు పెరగడం, పిత్తాశయంలో రాళ్లు అడ్డుపడడం వంటి వ్యాధులు వారిని వెంటాడు తున్నాయి. దీని మూలాల్లోకి వెళితే అధిక శాతం పాఠశాల విద్యార్థులు సరిపడా నీరు తాగడం లేదు. దీనివల్ల వారు పలు వ్యాధుల బారినపడుతున్నారు. పాఠశాలల్లో తాగునీటి సదుపాయం ఉన్నా, ఇళ్ల నుంచి సీసాల్లో నీటిని తీసుకెళ్లినా, పరిస్థితిలో మాత్రం మార్పు ఉండటం లేదు. దీంతో పిల్లలు త్వరితగతిన నీరస పడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనికోసం కేరళ ప్రభుత్వ పాఠశాలలో రోజుకు నాలుగు సార్లు గంట మోగిస్తున్నారు.

ఆ నీటి గంట సమయంలో తగిన మోతాదులో వారు నీటిని తాగేట్లు చూస్తున్నారు. తద్వారా విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోంది. విద్యార్థుల్లో డీహైడ్రేషన్ సమస్యను అధిగమించేందుకు కేరళ రాష్ట్రం లోని చెరువత్తూరు, వలియపరంబు గ్రామ పంచాయతీల పరిధి లోని పాఠశాలల్లో ప్రత్యేకంగా 'నీటి గంట' ఏర్పాటు చేశారు. అక్కడ ప్రతి మూడు గంటలకు ఒకసారి గంటను మోగిస్తున్నారు. ఆ సమయంలో విద్యార్థులు నీరు తాగేలా ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తారు.

ఈ కార్యక్రమం ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిని స్ఫూర్తిగా తీసుకున్న కర్నూలు జిల్లా అధికారులు 'నీటి గంట'కు శ్రీకారం చుట్టారు. వినూత్నంగా మొదలైన ఈ కార్యక్రమం మీడియా, సోషల్ మీడియాలలో వైరల్ అయ్యింది. ఇదే స్ఫూర్తితో కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఇటువంటి కార్యక్రమాన్ని అమలు చేయడానికి విద్యాశాఖాధికారులు ప్రయత్నిస్తున్నారు. నిర్దేశిరచిన సమయంలో పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కొళాయిలు, ఇతర సదుపాయల నుంచి నీటిని పట్టుకుని తాగాలి. ఇందుకు 2 నుంచి 5 నిముషాల సమయాన్ని కేటాయిస్తారు. ఇంటి వద్ద నుంచి కూడా తాగు నీటిని తెచ్చుకోవచ్చు. రాష్ట్రం లోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 'నీటి గంట'ను విధిగా అమలు చేయాలి. ఇది మంచి కార్యక్రమం కావడం వల్ల ప్రైవేటు పాఠశాలలు కూడా దీని అమలుకు చర్యలు తీసుకోవాలి. అయితే మన రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికీ తాగునీటి సౌకర్యం లేని ప్రభుత్వ పాఠశాలలు అనేకం ఉన్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు విద్యా శాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో నిత్యం నాలుగు పర్యాయాలు నీటిని తాగించేలా నీటి గంట కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈమేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దీనిని తక్షణం అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. పలు జిల్లాలలో కొన్ని స్కూళ్లలో ఇప్పటికే నీళ్ళ గంటలు కొట్టి విద్యార్థులచే తాగిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. దీని మీద మరింత అధ్యయనం చేయమని విద్యాశాఖ మంత్రి అధికారులను ఆదేశించారు. కాబట్టి ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో నీటి వసతి కల్పించాలి. వాటి మరమ్మతులు, నిర్వహణ బాధ్యతలు పంచాయితీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు కేటాయించాలి. అప్పుడే ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది.

మరింత వేగంగా తెలంగాణ అభివృద్ధి

ప్రాజెక్టులు సత్వరం పూర్తి చేసే సంకల్పం

మున్సిపాలిటీల్లోనూ టిఆర్ఎస్ గెలవాలి

జోగురామన్న పిలుపు

ఆదిలాబాద్,నవంబర్26(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తరవాత గత ఐదేళ్ల అభివృద్ధిని చూపి ప్రజలు టిఆర్ఎస్‌ను మరోమారు ఆదరించి సిఎంగా కెసిఆర్‌ను చేసారని మాజీమంత్రి ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కెసిఆర్‌అనేక నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. అభ్యర్థి సోమారపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రాజెక్టులు పూర్తి కావాలన్నా, నిరంతరాయ విద్యుత్ కొనసాగాలన్నా టిఆర్ఎస్ మరోమారు అధికారంలోకి రావాల్సి ఉందన్న లక్ష్యంతో ప్రజలు అధికారం కట్టబెట్టాలని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికలు రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు చాలా కీలకమైనవన్నారు. విపక్ష నాయకులు చెప్పిన మాయ మాటలను నమ్మి ఓటేస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం కుంటు పడుతుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపిన సీఎం కేసీఆర్‌పై అన్ని వర్గాల ప్రజలకు విశ్వాసం ఉందని ఆయన అన్నారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలతో అందరికీ న్యాయం జరిగిందన్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు చేరాయన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే టీఆర్ఎస్ పార్టీ ప్రచార అస్త్రాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ప్రజల విశ్వాసం కోల్పోయాయన్నారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ పార్టీ గెలిస్తే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే రాష్ట్రం సంక్షోభంలో కూరుకుపోతుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఎన్నికలప్పుడు ఇంటింటికీ తిరిగి నాలుగు మాటలు చెప్పినంత మాత్రాన ప్రజలు వినే స్థితిలో లేరన్నారు.కేసీఆర్‌తోనే అభివృద్ధి జరుగుతుందని అనేకులు గుర్తించి టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరవాత ప్రజలు కోరుకున్న పాలననే కేసీఆర్ అందించారన్నారు. పార్టీలో చేరిన కార్యకర్తలందరూ ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకోవాలని సూచించారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ పరుల పాలు కాకుండా కాపాడు కోవాలని అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుంచేందుకు సీఎం కేసీఆర్ అహర్నిశలు శ్రమిస్తున్నారని, అందుకోసం ప్రజలందరూ అండగా నిలవండి అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. విపక్షాలు అభివృద్ధిని అడ్డుకొనే ప్రయత్నం తప్ప మరొకటి లేదన్నారు. ప్రతిపక్షాలు అధికారం కోసం పార్టీ సిద్ధాంతాలను తుంగలో తొక్కి అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. కేసీఆర్‌ను ఓడించే పార్టీకానీ, నాయకుడు కాని లేరన్నారు. 68 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు ప్రజలకు ఏం చేశాయో చెప్పాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల ఆకాంక్షను నెరవేర్చలేక ఘోరంగా విఫలమయ్యాక టీఆర్ఎస్ అవకాశం ఇచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే బడుగుబలహీన వర్గాల అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు.

త్రిశంకు స్వర్గంలో ఆర్టీసీ కార్మికులు

హైదరాబాద్, నవంబర్ 26:ధిక్కారమును సహించేది లేదన్న రీతిలో తెలంగాణ సిఎం కెసిఆర్ ఉన్నట్లుగా ఉంది. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేసి, ఇక అస్త్ర సన్యాసం చేశారు. కొట్లాడే ఓపిక లేదన్న భావనలో ఉన్నారు. రాజు మొండిగా ఉన్న రాజ్యంలో ఓటమే తప్ప గెలుపు ఉండదు. ఆర్టీసీ కార్మికులకు ఇది అక్షరాలు వర్తిస్తుంది. అందుకే వారు సమ్మెను విరమించుకున్నట్లు ప్రకటించారు. కానీ ఆర్టీసీపై యుద్ధం ప్రకటించిన సిఎం కెసిఆర్ మాత్రం ససేమిరా అంటున్నారు. మిమ్మల్ని చేర్చుకునేది లేదని తెగేసి చెప్పారు. దీంతో ఇప్పుడు ఆర్టీసీ కార్మికుల పరిస్థితి త్రిశంకు స్వర్గంలో పడింది. తిండీ తిప్పలు లేక అనేక వేల కార్మిక కుటుంబాలు రెండు నెలలుగా రోడ్డున పడ్డాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వారి బతు కులు ఎలా ఉంటాయన్నది ఆందోళనకర ంగా మారింది. ఇప్పటికే అనేక గుండెలు ఆగాయి. అనేకమంది ఆత్మబలిదానాలు చేసు కున్నారు. ఈ దశలో సర్కార్ నిర్ణయంతో మరెంత మంది బలవుతారో అన్న ఆందోళన కలుగుతోంది. అయితే ఈ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయడం లేదు. నా మాట వినకుంటే అంతే సంగతులు.. మిమ్మల్ని శంకరిగిరి మాన్యాలు పట్టిస్తా అన్న రీతిలో పాలకులు భీష్మించుకు కూర్చున్నారు. సమ్మె విరమించినా ఉద్యోగంలో చేరే భాగ్యం లేకపోవడం అన్నది ఇదే తొలిసారి కానుంది. మొత్తంగా కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల జీవితాలు ఆగమ్మైపోతున్నాయి. ఈ పరిస్థితికి ఎవరు కారణం అంటే అందరూ కారణమే. నవరవర నీచే నాచే వరమడిగిన కుంతిచేత... వాసవు చేత న్...కర్ణుడీలిగే ఆరుగురి చేతన్.. అన్నట్లుగా ఆర్టీసీ కార్మికులు అందరి కార ణంగా ఆకలి చావులకు సిద్ధం కావాల్సిందే. వారికి బలిదానం తప్పమరో మార్గం లేకుం డా పోయిందని చెప్పాల్సిందే. ప్రభుత్వం... కార్మిక సంఘాల నాయకులు.. ప్రతి పక్షాలు.. చివరకు హైకోర్టు కూడా వారిని కాపాడలేకపోయింది. ప్రభుత్వం నిర్దయ కారణంగా ఇప్పటికే కొంతమంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకోగా, మరికొందరు గుండెపోటుతో చనిపోయారు. 52రోజుల పాటు కడుపు కాల్చుకుని సమ్మె చేసిన కార్మికులకు ఇప్పుడు ఉద్యోగ భరోసా కూడా లేకుండా పోయింది. ఉద్యోగంలో చేరడం అన్నది ఇక అసాధ్యమని తేలిపోయింది. ఆర్టీసీ చరిత్ర ముగిసిన కథ ఆనాడే ప్రకటించిన సిఎం కెసిఆర్ ఆ మేరకు చర్యలకు సిద్ధంగా ఉన్నారు. కార్మికులు చస్తే నాకేంటి అన్న ఆయన ధోరణిలో ఆయన ఉన్నారు. సొంత రాష్ట్రం ఏర్పడితే బంగారు భవిష్యత్తు ఉంటుందని నమ్మబలికిన ఇప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సం ఆర్టీసీకి మనుగడే లేకుండా చేస్తున్నారు. తన మాట వినకుండా సమ్మె చేయించిన కార్మిక నాయకులపై ఆగ్రహంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీని నడపలేమని తేల్చిచెప్పారు. ఆనాడు ఉద్యమ నాయకత్వం వహించిన నేటి తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ నాయకులు నేడు మౌనాన్ని ఆశ్రయించారు. సమ్మె విరమించాం.. విధుల్లో చేరుతాం... బేషరతుగా విధుల్లోకి తీసుకోవలసిందిగా కార్మిక నాయకులు ప్రాధేయపడుతున్నా ప్రభుత్వ పెద్దల మనస్సు కరగడంలేదు. కార్మికుల పట్ల సానుభూతి ఉన్న అధికార పార్టీ నాయకులు కూడా ముఖ్యమంత్రి కెసిఆర్‌కు భయపడి నోరు మెదపడం లేదు. ఓట్ల కోసం వేల కోట్లతో పథకాలు ప్రవేశ పెడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్.. ఇప్పుడు ఆర్టీసీని నడపడానికి అవసరమైన కొన్ని వందల కోట్ల రూపా యలను కూడా ఇవ్వలేమని చెతులెత్తేసారు. దీంతో వారు ఏం చేయాలో కూడా దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. సమ్మె వల్ల కలిగిన నష్టంమాటెలా ఉన్నా మొత్తం జీవితాలకే ఎసరు వచ్చింది. బతకడమెలాగా అన్నది ఇప్పుడు వారిముందున్న ప్రశ్న. కేంద్రం కూడా చూసీచూడనట్లుగా ఉంది. సమ్మెలోకి దిగిన కార్మికుల భుజంపై తుపాకీ పెట్టి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను దెబ్బతీయాలని భావించిన ప్రతిపక్షాలు ఇప్పుడు చేతులు ఎత్తేశాయి. కార్మికులను రెచ్చగొట్టిన ప్రతి పక్షాలు క్రమంగా బాధ్యత నుంచి తప్పు కొన్నాయి. సమ్మె ప్రారంభంలో కార్మికులలో ఆశలు చిగురింపజేసిన హైకోర్టు కూడా చివరకు చేతులెత్తేసింది. మేధావులు కూడా ఏమీ చేయలేకపోతున్నారు. సమైక్య రాష్ట్రం లో ఇలాంటి పరిస్థితి ఏనాడూ ఉత్పన్నం కాలేదు.స్వీయ పాలన వస్తే తమ జీవితాలు మరింత బాగుపడతాయన్న ఉద్దేశంతో ఆర్టీసీ కార్మికులు కూడా సకల జనుల సమ్మెలో పాల్గొని తమ వంతు పాత్ర పోషించారు. మొత్తం మీద ఇప్పుడున్న పరి స్థితుల్లో సిఎం కెసిఆర్ చెప్పినట్లుగా ఆర్టీసీ కాలగర్భంలో కలసిపోవడం ఖాయంగా కనిపిస్తున్నది. సుదీర్ఘ పోరాటం తర్వాత సిద్ధించిన తెలం గాణ రాష్ట్రంలో ఈ పరిణా మం చోటు చేసుకోవడం అత్యంత విషాద మని చెప్ప వచ్చు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ, ఆజంజాహి మిల్లు తదితర అనేక సంస్థలకు పునరు జ్జీవనం వస్తుందని భావించిన తెలంగాణ ప్రజలకు, అవి తెరుచుకోవడం కాదు..ఉన్న ఆర్టీసీ తలుపులు మూసుకుని పోతు న్నా యన్న బాధ కలుగుతోంది. పాలకుల్లో దూరదృష్టి, ప్రజల పట్ల సాను భూతి లేకపో వడం ఈ పర్యవసానాలకు కారణంగా చూడాలి. సంక్షేమం పేరిట అడ్డగోలుగా ప్రజాధనాన్ని పంచిపెడుతున్న పాలకులు.. సామాజిక బాధ్యతల నుంచి తప్పుకొంట న్నారు. దీంతో ఆర్టీసీ కథ కంచికి చేరడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ప్రజా రవాణా నుంచి తప్పుకోవడం అన్నది ప్రజలపై భారం మోపే ప్రక్రియగానే చూ డాలి. దీంతో ప్రైవేట్ ఆపరేటర్ల చేతికి జుట్టు ఇచ్చినట్లు అవుతుంది. దీనిని గమనించకపోవడం మనద దౌర్భాగ్యంగా చూడాలి. ఏదేమైనా రానున్న రోజుల్లో కార్మికుల భవి తవ్యం ఏమిటన్నది శేషప్రశ్నగా మిగిలిపో రాదని కోరుకుందాం.

తిరుగులేని రాజకీయ శక్తిగా కేసీఆర్

ప్రత్యామ్నాయ నాయకుడు లేని రాష్ట్రంగా తెలంగాణ

అందుకే కఠిన నిర్ణయాలతో ముందుకు

ఆర్టీసీ విషయంలోనూ ఇదే ధోరణి

హైదరాబాద్,నవంబర్26(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాజకీయాలలో ముఖ్యమంత్రి కేసీఆర్ తిరుగులేని శక్తిగా ఎదిగారు. రాజకీయంగా ఆయన తీసుకున్న నిర్ణయాలన్నీ సత్ఫలితాలనే ఇస్తున్నాయి. గత ఎన్నికలలో సిట్టింగులందరికీ మళ్లీ టికెట్లు ఇస్తే నష్టం జరుగుతుందని పార్టీలో కొందరు సీనియర్లు వాదించినా... సిట్టింగులందరికీ టికెట్లు ఇవ్వడం, వారంతా ఎన్నికల్లో గెలవడంతో కేసీఆర్‌కు తిరుగులేకుండా పోయింది. ఆర్టీసీ సమ్మె కొనసాగుతున్నప్పుడే జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో కూడా భారీ మెజారిటీ లభించడం తో పార్టీలో కేసీఆర్‌కు ఎదురు చెప్పేవారే లేకుండా పోయారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందనీ, వచ్చే ఎన్నికల్లో తమదే అధికారమనీ కలలుగన్న విపక్షాలకు హుజూర్‌నగర్ పెద్ద షాక్ ఇచ్చింది. కేసీఆర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్న వాళ్లు కూడా ప్రత్యామ్నాయ నాయకుడు ఎవరంటే నోరు వెళ్లబెట్టే పరిస్థితి దాపురించింది. ఈ పరిణామం సిఎం కేసీఆర్‌కు బాగా కలిసి వస్తోంది. ప్రత్యామ్నాయం కోసం పోటీపడుతున్న కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీకి చెందినవారు నాయకత్వ పటిమను పెంచుకునే ప్రయత్నాలు చేయకుండా కేసీఆర్‌ను తిట్టిపోయడమే పనిగా పెట్టుకున్నారు. రాజకీయంగా కేసీఆర్ ముందు నిలబడే నాయకుడే లేకుండా పోయారు. ఈ కారణంగా కేసీఆర్‌ను నిలువరించే పరిస్థితి తెలంగాణలో లేకుండా పోయింది. ఫలితంగా ఆర్టీసీ కార్మికులకు ప్రస్తుత దుస్థితి దాపురించింది. టెలికాం రంగంలో ప్రైవేట్ ఆపరేటర్లకు పెద్దపీట వేయడంతో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా ఉన్న బీఎస్ఎన్ఎల్ వంటి సంస్థలు ఇప్పుడు దివాలా బాట పట్టాయి. ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేసే సిబ్బంది కూడా కొంతవరకు ఈ పరిస్థితికి కారణం. హక్కుల కోసం మాత్రమే పోరాడిన వారు తమ బాధ్యతల గురించి విస్మరించారు. దీంతో పాలకులు ఆయా రంగాలను ప్రైవేటుపరం చేస్తూ చేతులు దులుపుకొంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా కొన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్లను మూసివేశారు. అయితే వాటిల్లో పని చేసిన వారి సంఖ్య స్వల్పంగా ఉన్నందున అప్పట్లో సమస్య ఏర్పడలేదు. ఆర్టీసీ పరిస్థితి వేరు. 50 వేల మందికిపైగా కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న అతి పెద్ద రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ ఇది. ఈ సంస్థకు కూడా ఇప్పుడు మనుగడ లేకుండా చేస్తున్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె సాకుతో 50 శాతం బస్సు రూట్లను ప్రైవేటుపరం చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం, హైకోర్టు సమర్థించడం జరిగిపోవడంతో ఆర్టీసీని రక్షించాలన్న ఆలోచన నుంచి సిఎం కెసిఆర్ దూరం జరిగారు. దీంతో ఆయన చెప్పినట్లుగానే ఆర్టీసీ కథ కంచికి చేరిందనే భావించాలి. ఒకప్పుడు ప్రైవేట్ ఆపరేటర్ల చేతిలో ఉన్న రూట్లను జాతీయం చేయాలన్న డిమాండ్ ఉండేది. మారిన పరిస్థితులలో ఆర్టీసీకి నష్టాలు రావడం సహజం. లాంగ్ రూట్లు మాత్రమే లాభదాయకంగా ఉంటున్నాయి. పల్లె వెలుగు పేరిట నిర్వహిస్తున్న రూట్లలో నష్టమే వస్తుంది. ఒకప్పుడు గ్రామాలకు బస్సులు రావాలన్న డిమాండ్ ఉండేది. ఇప్పుడు మారుమూల గ్రామాలలో సైతం ద్విచక్ర వాహనాలు, ఆటోలు రావడంతో బస్సు ఎక్కేవారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. దీంతో ఆర్టీసీ ఆదాయం తగ్గిపోయింది. ఇదొక సహజ పరిణామంగానే చూడాలి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మినీ బస్సులను ప్రవేశపెట్టకపోవడం వల్ల ఈ పరిణామం తలెత్తింది. నష్టాల బాటితో ఆర్టీసీని మనుగడలో లేకుండా చేయాలన్నైకైక సంకల్పంతో సిఎం కెసిఆర్ ఉన్నారు. అందుకే సమ్మె విరమణ ప్రతిపాదనను ఆయన పట్టించుకోవడం లేదు. సమ్మె చేయడం కెసిఆర్‌కు బాగా కలసి వచ్చింది. ప్రజలు కూడా ఉన్న బస్సులతో అడ్జస్ట్ కావడంగత రెండు నెలలుగా అలవాటు చేసుకున్నారు. ఆర్టీసీ కార్మికులు, వారి నాయకులు ప్రస్తుత పరిస్థితులలో కేసీఆర్‌ను శరణు కోరడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదు. ప్రతిపక్షాలు గానీ, కార్మికులు గానీ ముఖ్యమంత్రిని ప్రభావితం చేయగల పరిస్థితుల్లో లేరు. ఆర్టీసీలో 31 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వంలో సంబంధిత శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్వయంగా ఫోన్ చేసినా ముఖ్యమంత్రి కేసీఆర్ అందుబాటులోకి రాలేదని చెప్పడం చూస్తూ బిజెపి కూడా నాన్ సీరియస్‌గా ఉందనుకోవాలి. తాను పెంచి పోషించిన అశ్వత్థామరెడ్డి తననే ధిక్కరించడాన్ని కేసీఆర్ సహించలేకపోయి ఉండవచ్చు. ఈ కారణంగా.. కేసీఆర్ అంగీకరిస్తే అశ్వత్థామరెడ్డిని పక్కనపెట్టి మిగతా నాయకులను చర్చలకు పంపేందుకు కూడా తాము సిద్ధమని వర్తమానం పంపినా.. ముఖ్యమంత్రి మనసు కరగలేదు. నాయకులను కాదని తాను ఇచ్చిన పిలుపునకు స్పందించి విధుల్లో చేరడానికి కార్మికులు సిద్ధపడకపోవడం కూడా కేసీఆర్ ఆగ్రహానికి కారణమై ఉంటుంది. ఇప్పుడు హైకోర్టు తీర్పుతో కేసీఆర్ మరింత కఠినంగా ఉన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ వంటి సంస్థకు ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుందని కార్మికులు, నేతలు కూడా ఊహించి ఉండరు. ప్రజలు మమ్మల్ని భారీ మెజారిటీతో గెలిపించారు కనుక మేం ఏం చేసినా చెల్లుబాటు అవుతుందని భ్రమించడం పొరపాటు. ఇవ్వాళ జైకొట్టినవాళ్లే రేపు

స్కూళ్లను విలీనంచేసి..
నాశనం చేస్తున్నారు
– కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్26(ఆర్ఎన్ఎ) : విద్యపైన సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో మాట్లాడారు. కేజీ నుంచి పీజీ వరకు ఫ్రీగా విద్య అందిస్తామని చెప్పిన కేసీఆర్.. ఇప్పుడు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలు మూసివేస్తామనడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందన్నారు. 12,440 పాఠశాలలు మూసివేస్తే.. గ్రామీణ ప్రాంతాలలో విద్యకు దూరం అవుతారని తెలిపారు. విద్యపైన పెట్టే వ్యయాన్ని పెట్టుబడిలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికే విద్య దెబ్బతిన్నదని, తెలంగాణ వచ్చాక ఒక్క ఉపాధ్యాయునికి పదోన్నతి ఇవ్వలేదన్నారు. ఒక కొత్త టీచర్‌ను నియమించలేదని, వ్యవస్తను నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. 12వేల బడులు మూసివేస్తే 36వేల మంది ఉపాధ్యాయులకు ఉపాధి పోతుందన్న ఆయన, దేశంలో విద్య హక్కు చట్టం ప్రకారం మూడు కిలోమీటర్లు దూరంలో ఒక్క పాఠశాల ఉండాలన్నారు. కానీ కేసీఆర్ ఐదు కి.మీ దూరంలో పాఠశాలను ఏర్పాటు చేస్తే ఆరు లక్షల మంది విద్యార్థులకు ఇబ్బదులు వస్తాయని చెప్పారు. తెలంగాణ వస్తే విద్య బాగుపడుతదనుకుంటే స్కూళ్లను విలీనం చేసి నాశనం చేస్తున్నారని హర్షవర్ధన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ దృష్టిసారించి ప్రభుత్వ పాఠశాలలు మూతపడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కీలక సమస్యలపై కాంగ్రెస్ నాన్చివేత ధోరణి
అయోధ్య, 370 ఆర్టికల్ అంశాలతో ప్రధాని మోడీ ప్రచారం

రాంచీ,నవంబర్26(ఆర్ఎన్ఎ): అయోధ్య, 370 ఆర్టికల్ రద్దు లాంటి కీలక అంశాలను కాంగ్రెస్ పెండింగ్‌లో ఉంచిందని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. దేశాన్ని ఐక్యంగా ఉంచడంతో పాటు బలమైన భారత్ కోసం బీజేపీ పనిచేస్తోందని ఆయన చెప్పుకొచ్చారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అయోధ్య సమస్యకు పరిష్కారం చూపి, ప్రజలను సంతోషపెట్టామని ప్రకటించారు.ఇంతటి కీలకమైన సమస్యలను 70 ఏళ్లుగా నాన్చుతూ వచ్చిందని మండిపడ్డారు. జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ మాట్లాడుతూ... కీలకమైన అంశాలకు పరిష్కారం చూపకుండా నాన్చే అలవాటు కాంగ్రెస్ పార్టీదని, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగానే వాటికి పరిష్కారం చూపలేదని ఆయన ఆరోపించారు. కీలకమైన సమస్యలకు పరిష్కారం చూపుతామని తాము ఎన్నికల ముందే హామీ ఇచ్చామని, ఇచ్చిన రీతిలోనే తాము వాటికి పరిష్కారం చూపించామని ఆయన తెలిపారు. జార్ఖండ్‌లో బలమైన, స్థిరమైన ప్రభుత్వం నెలకొనాల్సిన అవసరం ఉందని, గత ఐదేళ్లుగా బలమైన ప్రభుత్వమే పాలించిందని, మరో ఐదేళ్లు ఇలాగే కొనసాగాలని ప్రధాని ఆకాంక్షించారు. సుస్థిరత, సుపరిపాలన, అభివృద్ధి, ఆత్మగౌరవం, జాతీయ భద్రత అనే అంశాల ప్రాతిపదికపై బీజేపీ రాష్ట్రంలో పాలించింది తెలిపారు. రాష్ట్రంలోని ప్రతిపక్షాలు కేవలం అధికారాన్ని కైవసం చేసుకోడానికే కూటమిగా ఏర్పడ్డాయని, ఒకవేళ ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో తిరిగి అస్థిరత ఏర్పడుతుందని ప్రధాని మోదీ హెచ్చరించారు.

హుజూర్‌నగర్‌లో స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన ఎమ్మెల్యే వానంపూడి సైదిరెడ్డి.

హుజూర్‌నగర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
పారిశుద్య పనులకు ప్రాధాన్యం ఇస్తున్నాం: ఎమ్మెల్యే

సూర్యాపేట,నవంబర్26(ఆర్ఎన్ఎ): జిల్లాహుజూర్ నగర్ మున్సపాలిటీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంకుశ వలి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ మన ఊరు బాగు చేసుకోవటం మనందరం బాధ్యతగా స్వీకరించాలన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు,కేటీఆర్ ప్రకటించిన నిధులు కేటాయించడం జరిగిందన్నారు. .హుజూర్ నగర్ చాలా అధ్వాన్నంగా ఉన్నదని, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నదని,దీని బాగుకై 30 రోజుల ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ పై ప్రతి ఒక్కపౌరుడు సమర భేరీ మోగించాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన 25కోట్లు,కేటీఆర్ ప్రకటించిన 20 కోట్ల రూపాయల నిధులతో మంజూరు అయ్యాయని పనులకు సిద్దంగా ఉన్నాయిన్నారు. మనం చేసే అభివృద్ధి మిగతా నియోజకవర్గాలకు పట్టణాలకి ఆదర్శంగా ఉండాలన్నారు. .ఈ నెల 27 నుండి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని వార్డులలో 30 రోజుల ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. అందులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి.ప్రజా సేవ చేయాలి అనుకునేవారు వార్డు ప్రజలకి వార్డు సమస్యలను వారే పరిష్కరించాలి.హుజూర్నగర్ నూతనంగా జేసిబి ని, అభివృద్ధి కోసం మరికొంత ఫండ్ ని ఏర్పాటు చేయడం కూడా జరుగుతుందన్నారు.

స్కూలు విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ

ఖమ్మం,నవంబర్26(ఆర్ఎన్ఎ): మధిర మండలం రాయపట్నం గ్రామం ప్రభుత్వ పాఠశాలలో ఉచిత యూనిఫాం పంపిణీ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పాల్గొన్నారు. అనంతరం స్కూల్ బిల్డింగ్ వసతులను ,మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా కమల్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, దీనికోసం పూర్తి బాధ్యత ఉపాధ్యాయుల తీసుకొని ప్రభుత్వ పాఠశాలను మరింత ముందుకు తీసుకు పోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెండెం లలిత, ఆత్మ కమిటీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు, టిఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి చిత్తారి నాగేశ్వరరావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు,వెలగపూడి శివరాం ప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శీలం వీర వెంకట రెడ్డి, తెళ్ళ కొండయ్య, తెళ్ళ వాసుదేవరావు, చెరుకూరి నాగార్జున, ఉద్దండు, సర్పంచ్ నండ్రు సుశీల, ఉప సర్పంచ్ మల్నేటి పుల్లారావు, విద్యా కమిటీ చైర్మన్ సరిత, తదితరులు పాల్గొన్నారు

యూపిలో అనూహ్య పరిణామం
ఆరడుగులు వేశాక..ఆపై వెనుదిరిగిన వధువు
పెళ్లి కొడుకు నచ్చలేదంటూ గోల
రద్దయిన వివాహ వేడుక

కాన్పూర్,నవంబర్26(ఆర్ఎన్ఎ): యూపీలోని కాన్పూర్‌లో జరిగిన ఒక పెళ్లి వేడుకలో వధూవరులు దండలు మార్చుకున్నాక, ఆ వధువు కాబోయే భర్త వెంట ఆరడుగులు నడిచింది. ఏడవ అడుగు పడబోయేంతలో ఆమె యూటర్న్ తీసుకుంది. ఈ పెళ్లి కొడుకు తనకు వద్దంటూ మొదికేసింది. పెళ్లి కొడుకు నల్లగా ఉన్నాడని, పెద్ద వయసుగల వ్యక్తిలా కనిపిస్తున్నాడని, ఇటువంటి పెళ్లి తనకు అవసరం లేదని తెగేసి చెప్పింది. దీంతో కంగుతిన్న వరుడు చేసేదేమీ లేక ఒంటరిగా ఇంటికి వెనుదిరిగాడు. వివరాల్లోకి వెళితే సచెండీ పరిధిలోని ఒక గ్రామంలోని రైతు ఇంట అతని కుమార్తెకు వివాహం జరుగుతోంది. సాయంత్రం విందు కార్యక్రమం పూర్తయ్యాక వరమాల కార్యక్రమం జరిగింది. తరువాత వేదమంత్రాల నడుమ వివాహ కార్యక్రమం ప్రారంభమయ్యింది. వధూవరులు ఏడడుగులు వేసే కార్యక్రమంలో ఆరడులు పూర్తయ్యాయి. ఇంతలో వధువు స్నేహితురాలు ఆమె చెవిలో ఏదో చెప్పింది. అంతే... వధువు ఆఖరి, ఏడవ అడుగు ముందుకు వేయకుండా అక్కడే ఆగిపోయింది. ముఖంపైనున్న మేలి ముసుగును తొలగించి, తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని తెగేసి చెప్పేసింది. దీంతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వధువును ఆమె తల్లిదండ్రులు ప్రశ్నించగా... వరుడు నల్లగా ఉన్నాడని, పైగా వయసుమీరిన వ్యక్తిగా కనిపిస్తున్నాడని ఆరోపించింది. అయితే ఇరువర్గాల పెళ్లివారు నచ్చజెప్పేందుకు ఎంతగా ప్రయత్నించినా ఆమె వినలేదు. దీంతో విషయం పోలీసుల వరకూ చేరింది. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ వధువు వారి మాట వినలేదు. చివరికి చేసేందేం లేక వరునితో పాటు అతని బంధువర్గం ఇంటికి తిరుగుముఖం పట్టింది.

రాష్ట్ర ఆరోగ్యశాఖను..
దేశానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతున్నాం

- పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే కేసీఆర్ ఆదేశం
- సీఎం సూచనలతో కీలకమార్పులు చేయబోతున్నాం
- కుటుంబం యూనిట్‌గా ఆరోగ్య సమస్యలపై నివేదిక
- మరో ఏడు మెడికల్ కాలేజీలకోసం కేంద్రానికి విజ్ఞప్తి చేశాం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాను మెడికల్ హబ్‌గా తయారుచేస్తాం
- త్వరలో హాస్పిటల్స్ స్టాఫ్ రిక్రూట్‌మెంట్
- పీహెచ్‌సీల సంఖ్యను తగ్గించబోము

– వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

కరీంనగర్,నవంబర్26(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఆరోగ్య శాఖను దేశానికే రోల్ మోడల్ గా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంత్రి పరిశీలించారు. అనంతరం నియోజకవర్గ హస్పిటల్స్ పై రివ్యూ సందర్భంగా మాట్లాడిన ఈటల.. రోల్ మోడల్ కోసం తన నియోజక వర్గమైన హుజూరాబాద్ నుంచే చర్యలు మొదలు పెడుతున్నట్లు చెప్పారు. మూడు నెలలుగా వైద్య ఆరోగ్యశాఖపై పూర్తి అవగాహన కోసం పలు సమీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పేదవారికి మెరుగైన ప్రభుత్వ వైద్యం అందించేందుకు సీఎం సూచనల మేరకు కీలక మార్పులు చేర్పులు చేయబోతున్నట్లు చెప్పారు. గ్రౌండ్ లెవెల్లో ఉన్న సమస్యలను తెలుసుకొనేందుకు హుజురాబాద్ నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను స్వయంగా పరిశీలించానన్నారు. ఇదే తరహాలో రాష్ట్రమంతా పర్యటిస్తానని, పీహెచ్‌సీ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రేషనైజేషన్ చేసుకుంటామన్నారు. పీహెచ్‌సీల సంఖ్య తగ్గించబోమని చెప్పిన ఈటల.. రోగుల సంఖ్యనుబట్టి అవసరం ఉన్న చోటికి తరలిస్తామన్నారు. కొంతకాలంగా కుటుంబం వారీగా వ్యాధులు, అవసరమైన మందుల చిట్టా తయారు చేశామని, కుటుంబం యూనిట్ గా ఆరోగ్య సమస్యలపై నివేదిక తయారు చేస్తున్నావ ఎన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కింద ఉన్న ఆస్పత్రులన్నింటిలో స్టాఫ్ ను రిక్రూట్ చేసుకుంటామని తెలిపారు. మరో ఏడు కొత్త మెడికల్ కాలేజీల కోసం కేంద్రానికి విజ్ఞప్తి చేశామని ఈటల చెప్పారు. రాష్ట్రంలో వైద్యాన్ని ప్రజల ముంగిటికి తీసుకు వస్తామన్నారు. జబ్బులు వచ్చిన తరువాత లక్షల్లో ఖర్చు పెట్టడం కంటే.. ముందుగానే గుర్తించి చికిత్స అందించేందుకు వైద్య సదుపాయాలను మెరుగు పరుస్తున్నామని చెప్పారు. పేద వారికి జబ్బుచేస్తే ప్రభుత్వం ఉందనే భరోసా కల్పిస్తున్నామని, దేశంలో అతి ఎక్కువ మంది డాక్టర్స్ ఉన్న రాష్ట్రం తెలంగాణ అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత 700 పైచిలుకు మెడికల్ పీజీ సీట్లు పెరిగాయని, వీరందరూ కోర్సులు పూర్తి చేసుకుని వస్తే హాస్పిటల్స్ లో డాక్టర్స్ కొరత ఉండదన్నారు. 33 మెడికల్ కాలేజీలు రాష్ట్రంలో ఉన్నాయని, రూ. 550 కోట్లతో 9 జిల్లా కేంద్రాల్లో ఉన్న హాస్పిటల్స్ ను అప్ గ్రేడ్ చేయబోతు న్నామన్నారు. కరీంనగర్ జిల్లా ఆస్పత్రిని 1000 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దబోతున్నామని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ను మెడికల్ హబ్ గా తయారు చేయడంలో భాగంగా అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. హుజూరాబాద్ సహా అన్ని నియోజక వర్గ కేంద్రాల్లో అన్ని వసతులు సిబ్బందితో కూడిన ఆస్పత్రులు ఉండేలా చూస్తామని మంత్రి ఈటల తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల్లో పౌష్టికాహార లోపం
ఇక్రిశాట్ సహకారంతో ఆహారం అందచేత
తయారీలో గిరిజన యువతకు శిక్షణ

నిర్మల్,నవంబరు 26(ఆర్ఎన్ఎ): ఏజెన్సీలో అత్యధికంగా పౌష్టికాహార లోపం, రక్తహీనతతో ప్రజలు బాధపడుతున్నారు. గిరిజనులు ఈ పరిస్థితి అధిగమించడానికి వారికి మరింత ప్రోత్సాహం అందిస్తున్నది. గిరిజన సంక్షేమశాఖ ఆదేశాల మేరకు అధికారులు ఉమ్మడి జిల్లాలోని కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో, ఉట్నూర్‌లో పౌష్టికాహార కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. ఇక్రిశాట్ సంస్థ తనదైన పరిజ్ఞానంతో ఈ పౌష్టికాహార కేంద్రాలను ఏడాది పాటు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇక్రిశాట్ తయారు చేసిన పౌష్టికాహారాన్ని గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) ద్వారా ఆశ్రమ, గురుకుల పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయనున్నారు. ప్రైవేటు భాగస్వామ్యం లేకుండా ప్రభుత్వం ద్వారానే అందించడం ద్వారా అవక తవకలు జరగకుండా నేరుగా పాఠశాలలు, వసతిగృహాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు అందనున్నది.

పాఠశాలలో చదువుకునే గిరిజన విద్యార్థులు రక్తహీనతతో అనారోగ్యానికి గురవుతున్నారు. అందుకోసం విద్యార్థుల చదువుపై ప్రభావం పడకుండా ఉండేందుకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యంగా ఉండడానికి, రక్తహీనత ఏర్పకుండా ఉండడానికి దోహద పడుతుంది. పౌష్టికాహార తయారీ కేంద్రాల్లో ఏర్పాటుతో బలవర్ధకమైన ఆహారం అందించడమే కాకుండా తయారీ కేంద్రంలో పని కల్పించడం ద్వారా గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కలుగనున్నది. అందుకోసం ఐటీడీఏ ద్వారా ఏర్పాటుచేసిన యూత్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా గిరిజన యువతీ యువకులకు శిక్షణ అందించి జేఎల్‌జీ గ్రూప్ ఏర్పాటు చేసి వారికి ఉపాధి కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఏజెన్సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, కిశోర బాలికలకు, గర్భిణులకు, బాలింతలకు, పౌష్టికాహాలోపం గలవారికి అందించనున్నారు.

వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రక్త నమూనాలు పరీక్షించి నప్పుడు చాలా మందికి రక్తహీనత తక్కువగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఐటీడీఏ ప్రాంతంలో పౌష్టికా హార కేంద్రాలు తామే ఏర్పాటు చేసి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకొనున్నారు. దేశంలోనే మొదటి సారిగా ఇక్రిశాట్ పరిజ్ఞానంతో అత్యంత పోషక విలువలు కలిగిన పౌష్టికాహార కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. సంవత్సరం పాటు ఇక్రిశాట్ సంస్థ పర్యవేక్షణలో పౌష్టికాహార కేంద్ర కొనసాగనున్నది. ఇందుకోసం ఉట్నూర్ మండల కేంద్రంలోని పాత కోర్టు భవనానికి మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ నాణ్యత గల పల్లీలు, బెల్లంతో కూడిన పల్లిపట్టి తయారు చేయనున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కూడా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ జొన్నలు, కొర్రలు, పెసర, కందితో పాటు ఇతర ఆహార దినుసులతో కలిపి తక్షణమే వండి తినే విధంగా న్యూట్రి బాస్కెట్లను ఇక్రిశాట్ సంస్థ వారి సహకారంతో తయారు చేయనున్నారు. ఇప్పటికే సంస్థ సీనియర్ అధికారిని ఇక్కడ నియమించారు. ఆయన సలహా మేరకు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం, యంత్రాలను సైతం అందించ నున్నట్లు సంస్థ అధికారి పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాతో పాటు భద్రాచలం ఐటీడీఏ పరిధిలో కూడా ఏటూరునాగారంలో న్యూట్రి బాస్కెట్, భద్రాచలంలో పల్లిపట్టి తయారు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తున్నది. పౌష్టికాహార కేంద్రా ల్లో తయారుచేసిన సరుకుల్లో నాణ్యాతా ప్రమాణాలకు పెద్దపీట వేయనున్నారు. ప్రస్తుతం అందిస్తున్న సరుకులు ప్రైవేటు కంపెనీలు ద్వారా అందుతున్నాయి. వాటికి అధిక ధర ఉండడంతో పాటు నాణ్యత కూడా అంతంతగానే ఉండడం కారణంగా

ప్రభుత్వం ద్వారానే నేరుగా పౌష్టికాహార కేంద్రాలు ఏర్పాటు చేసి నాణ్యతతో పాటు తక్కువ ధరకు అందించేందుకు చర్యలు చేపట్టారు.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదించాలి

మహబూబ్‌నగర్,నవంబరు 26 (ఆర్ఎన్ఎ): కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి బీజేపీ నేతలు అధికారంలోకి వచ్చాక కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకెపోగు రాములు అన్నారు. ఈ శీతాకాల పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ ప్రభుత్వం మాదిగలను మోసం చేసిందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టేలా తనవంతు ప్రయత్నం చేస్తానని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని అన్నారు. ఇందుకు మాదిగ యువకులు, మేధావులు, ఉద్యోగులు డిసెంబర్‌లో నిర్వహించతలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలివచ్చి ఎస్సీ వర్గీకరణ అవశ్యకతను కేంద్రానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఆర్టీసీ సమ్మెపై తక్షణం స్పందించాలి
వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి: చిన్నారెడ్డి

వనపర్తి,నవంబరు 26(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమణ ప్రకటించినందున వారిని తక్షణం ఉద్యోగాల్లోకి తీసుకుని ఆర్టీసీని కాపాడాలని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి డాక్టర్ చిన్నారెడ్డి డిమాండ్ చేశారు. ఆర్టీసీకి చెందిన కోట్లాది ఆస్తులపై కేసీఆర్ కన్నేశారని, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులకు ఆర్టీసీ వనరులను పంచిపెట్టేందుకే సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఆర్టీసీ చరిత్రలో ఇంత పెద్ద సమ్మె ఎప్పుడూ జరుగలేదని, ముందస్తు ప్రణాళికతో అన్ని లెక్కలు సరిచూసుకొని ఆర్టీసీని ప్రైవేటీకరణ చేపట్టి ఆ సంస్థ ఆస్తులను తనకు కావాల్సినవారికి కట్టబెట్టు కోవడమే లక్ష్యంగా కేసీఆర్ కుట్ర పన్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన ఆర్టీసీ కార్మికులను ఆ సంస్థను కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ద్రోహులుగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ అంశంపై ఇప్పటికే హైకోర్టు పలు మార్లు ప్రభుత్వ తీరును, అధికారుల తీరును తప్పుబట్టినా తీరు మారడంలేదని చిన్నారెడ్డి విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక, ఆర్థిక విధానాలను అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో మోదీ సర్కార్ ఆర్థిక నిపుణులతో చర్చించకుండానే సొంత నిర్ణయాలు తీసుకోవడం వల్ల దేశ ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారయిందన్నారు. మేకిన్ ఇండియా, ఇండియా స్టార్టప్ లాంటి నినాదాలతో హోరెత్తించడం తప్ప కేంద్రం చేసిందేమి లేదన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి
సిద్దిపేటను అగ్రగామిగా నిలిపేందుకు కృషి

సిద్దిపేట,నవంబరు 26(ఆర్ఎన్ఎ): రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాలకనుగుణంగా డిసెంబర్ 31లోగా జిల్లాలోని మున్సిపాలిటీల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిస్థాయిలో నిషేధం కోసం యత్నిస్తున్నామని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన సమావేశంలో ఆయా మున్సిపాలిటీల్లో డిసెంబర్ చివరి నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించాలని నిర్ణయించినట్లు తెలిపారు.ప్లాస్టిక్ రహిత పట్టణాలుగా మార్చాలన్నారు. సిద్దిపేట మున్సిపల్ అభివృద్ధిలో రోల్ మోడల్‌గా ఉండన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలన్నారు. ఇదే సమయంలో ఆయా మున్సిపాలిటీలు డిసెంబర్ తరువాత ప్లాస్టిక్‌ను పట్టణంలో నిషేధించినట్లు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఆయా మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ నిషేధంపై థార్డ్ పార్టీ ద్వారా విచారణ జరిపించి అవార్డులు ఇస్తామని తెలిపారు. మున్సిపాలిటీల్లో వివిధ రకాల పన్నుల వసూళ్లలో అధికారులు లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలన్నారు. సిద్దిపేట మున్సిపల్‌లో ప్రస్తుతం 60శాతం వసూల్లు జరిగాయని, నిర్ధేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మున్సిపాలిటీల్లో అక్రమ లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) పథకాన్ని నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా దరఖాస్తులను స్వీకరించి క్రమబద్ధీకరణ పక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో తడి, పొడి చెత్త సేకరణ విషయంలో ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత గూర్చి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధి
సానుకూల స్పందనతో మరింత ముందుకు

మెదక్,నవంబరు 26(నేటినిజం ప్రతినిధి): విరాళాల ద్వారాప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా తీసుకున్నచర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. పలువురు దాతలు ఇందుకు సహకరిస్తున్నారు. మెదక్ కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో విద్యా శాఖలో నెలకొన్న సమస్యలు చర్చకు వచ్చాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ ధర్మారెడ్డి 'మన ప్లలె బడి.. మన ధర్మ నిధి' లక్ష్యం వివరాలు వెల్లడించారు. తనవంతు వాటాగా రూ.25 వేలు ఇస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి హరీశ్‌రావు తన వేతనంలో నుంచి రూ.లక్ష ఇస్తామని చెప్పారు. ఈ క్రమంలో ఇతర ప్రజాప్రతినిధులు పోటీపడ్డారు. జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయులు సుమారు 4 వేల వరకు ఉండగా.. వారు ఒక రోజు వేతనాన్ని అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు దాదాపు రూ.65 లక్షలు ట్రస్ట్ ఖాతాలో త్వరలో జమకానున్నాయి. మొత్తానికి ఇప్పటివరకు సుమారు రూ.కోటి సేకరించినట్లు సమాచారం. దీనిని మరింత ముందుకు తసీఉకుని వెళ్లడం ద్వారా సమస్యలు పరిష్కరించాలని నిర్ణయించారు. 'మన ప్లలె బడి.. మన ధర్మ నిధి' లక్ష్యం నెరవేరేలా కలెక్టర్ పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ట్రస్ట్‌కు విరాళాల సేకరణ.. పాఠశాలల్లో సమస్యల గుర్తింపు, పరిష్కారానికి సంబంధించి గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీతోపాటు జిల్లా స్థాయి నిర్వహణ ఏజెన్సీకి రూపకల్పన చేశారు. జిల్లా కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్లుగా జేసీ, ఎస్పీ వ్యవహరించనున్నారు. మండల కమిటీలకు ఎంఈఓ చైర్మన్‌గా, ముగ్గురు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ముగ్గురు ఉపాధ్యాయులు, విద్యావేత్తలు లేదా ధర్మదాతల సభ్యులుగా.. గ్రామ కమిటీల్లో ప్రధానోపాధ్యాయుడు, వీఆర్వో, వీఆర్ఏ, ఉపాధ్యాయుడు కమిటీల్లో సభ్యులుగా ఉండనున్నారు. ఈ కమిటీ ఎన్నారైల వివరాలు సేకరించాలి. జిల్లా స్థాయి నిర్వహణ ఏజెన్సీ జిల్లా కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్ ఆదేశా మేరకు నడవాల్సి ఉంటుంది. 15 రోజులు శ్రమించి ట్రస్టుకు సంబంధించి విధివిధానాలు రూపొందించారు. ఎవరైతే కలెక్టర్‌గా ఉంటారో వారే ఈ ట్రస్టుకు బాధ్యత వహిస్తారు. సంస్థ చిరునామాగా సమీకృత కలెక్టరేట్ సముదాయం, కలెక్టరేట్ కార్యాలయం, మెదక్ 502110గా పేర్కొన్నారు. విరాళాలు అందించే వారితోపాటు విరాళాల మొత్తం, ఖర్చు వివరాలను వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. మొదటి దశలో పాఠశాలల్లో చిన్న చిన్న మరమ్మతులతోపాటు భవనాలకు పాత్యాంశ చిత్రపటాలతో ఆకర్షణీయమైన రంగులు వేయనున్నారు. రెండో దశలో అన్ని పాఠశాలల్లో తాగు నీటి ఫిల్టర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్న

శబరిమలకు బయలుదేరిన మహిళపై దాడి

– సీపీ కార్యాలయం ఎదుటే దాడి

– పెప్పర్ స్ప్రేతో దాడికి పాల్పడ్డ వ్యక్తి

తిరువనంతపురం, నవంబర్26(ఆర్ఎన్ఎ) : కేరళలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు మహిళా హక్కుల నేత తృప్తి దేశాయ్‌తోపాటు మొత్తం ఆరుగురు మహిళలు శబరిమల కేరళ వచ్చారు. శబరిమల అయ్యప్పను దర్శించుకోవడానికి భద్రత కల్పించాలంటూ కొచ్చి సిటీ పోలీసు కమిషనర్‌ను వారు ఆశ్రయించారు. అయితే, వారి బృందంలో ఒకరైన బిందు అమ్మినిపై సీపీ కార్యాలయం ఎదుటే దాడి జరిగింది. హిందూ సంస్థల కార్యకర్త ఒకరు కారంపొడి స్ప్రేతో ఆమెపై దాడి చేశాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. గత జనవరిలో హిందూ సంస్థల కళ్లుగప్పి బిందు అమ్మిని శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. తాజాగా కూడా తృప్తి దేశాయ్‌తో కలిసి మరోసారి అయ్యప్పను దర్శించుకోవడానికి ఆమె వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న హిందూ సంస్థల కార్యకర్తలు ఆమెపై దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో బిందుతోపాటు తృప్తి దేశాయ్ బృందాన్ని పోలీస్ కమిషనర్ కార్యాలయానికి పోలీసులు తరలించారు. దీనిపై ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ) అధ్యక్షుడు ఎన్.వాసు స్పందించారు. తృప్తి దేశాయ్ రాకపై మాకు ఎలాంటి సమాచారం లేదని, ఈ అంశాన్ని పోలీసులు, ప్రభుత్వమే తేల్చుకుంటారన్నారు. సుప్రీంకోర్టు చివరి తీర్పులో స్పష్టత లోపించినట్లు మేము ఇంకా భావిస్తున్నామని అన్నారు. అయితే తృప్తి దేశాయ్ రాక నేపథ్యంలో ఆందోళనలు చెలరేగే అవకాశం ఉందని నిలక్కల్, పంబ బేస్ క్యాంపుల్లో పోలీసులు బలగాల్ని మోహరించారు.

ప్రొటెం స్పీకర్ కోసం ఆరుగురి పేర్లు ప్రతిపాదన

బిజెపి సీనియర్‌నే వరించనున్న పదవి?

ముంబయి,నవంబర్26(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర అసెంబ్లీలో బుధవారమే బలపరీక్ష నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ప్రొటెం స్పీకర్‌గా ఎవరిని నియమించాలన్న దానిపై తర్జన భర్జన కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల లోపు బలపరీక్ష నిర్వహించాలని సుప్రీం ఆదేశించింది. దీంతో ప్రొటెం స్పీకర్ పదవి కోసం ప్రస్తుత ప్రభుత్వం.. ఆరుగురి పేర్లను ప్రతిపాదించింది. ఆ ఆరుగురి పేర్లను గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీకి పంపించారు. రాధాకృష్ణ విఖే పాటిల్(బీజేపీ), కాళిదాస్ కోలంబ్కర్(బీజేపీ), బాబన్‌రావు ఖికాజీ(బీజేపీ), బాలసాహెబ్ థోరత్(కాంగ్రెస్), కేసీ పద్వి(కాంగ్రెస్), దిలీప్ వాల్సే పాటిల్(ఎన్సీపీ) పేర్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. వీరిలో అత్యంత సీనియర్లు.. బాలసాహెబ్ థోరత్, కాళిదాస్ కోలంబ్కర్. సభలో అత్యంత సినీయార్టి ఉన్న వారికే ప్రొటెం స్పీకర్ పదవిని అప్పజెప్పడం జరుగుతుంది. ఈ ఆరుగురిలో ఒక్కరి పేరును గవర్నర్ ఖరారు చేసే అవకాశం ఉంది.

ప్రోటెమ స్పీకర్ అంటే తాత్కాలిక స్పీకర్. అధికారిక స్పీకర్ ఉండదు కాబట్టి.. బలపరీక్షకు కావాల్సిన తతంగం అంతా ఆయన చేతులమీదుగానే సాగాల్సి ఉంటుంది. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఇచ్చిన లేఖ ప్రకారం.. గవర్నర్ ప్రోటెమ్ స్పీకర్‌ను నియమించడం జరుగుతుంది. 5 గంటల లోపే బలనిరూపణ జరగాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. ఇప్పుడు కీలక బాధ్యతలన్నీ ప్రోటెమ్ స్పీకర్ ఆధీనంలోనే ఉంటాయి.

తెలంగాణలో అప్రకటిత ఎమర్జెన్సీ

కెసిఆర్ తీరుపై మండిపడ్డ తమ్మినేని

ఆర్టీసీ కార్మికులను విధుల్లో చేర్చుకోవాలని డిమాండ్

హైదరాబాద్,నవంబర్26(ఆర్ఎన్ఎ): సమ్మె విరమించి విధుల్లోకి చేరేందుకు వచ్చిన కార్మికులను అరెస్ట్ చేయడం దారుణం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మండిపడ్డారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ నడుస్తోందని అనిపిస్తుందన్నారు. మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడిన ఆయన.. తెలంగాణలో ఆందోళనలను అణచి వేయాలనుకుంటే అంతకన్నా మూర్ఖత్వం ఉండదన్నారు. కార్మికుల ఆశయాలను అణచివేయడం కేసీఆర్ తెలివి తక్కువతనం అని మండిపడ్డారు. ప్రభుత్వ చర్యకు నిరసనగా బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్మికుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి విధుల్లోకి తీసుకోవాలని తమ్మినేని డిమాండ్ చేశారు. ఇదే సందర్భంలో ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ తీరుపై సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె విరమణకు సీపీఎం కారణం అన్నట్లుగా కొన్ని సభల్లో మందకృష్ణ చెబుతున్నారని ఆక్షేపించారు. ఆయన ఎవర్ని కాపాడాలని అలా చెప్తున్నాడో తెలియదని వ్యాఖ్యానించారు. ఆ రకమైన దుష్ప్రచారాన్ని మానుకోవాలని మందకృష్ణను తమ్మినేని కోరారు. మళ్లీ అలాంటి దుష్ప్రచారం చేస్తే తమ పార్టీ కార్యకర్తలు ఆయనను అడ్డగిస్తారని హెచ్చరించారు. రాజ్యాంగ పరిరక్షణ విషయంలో బీజేపీ అనేక ఉల్లంఘనలు చేస్తోందన్నారు. కేసీఆర్ కూడా బీజేపీ అడుగుజాడల్లో నడుస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఐఏఎస్ వ్యవస్థను కేసీఆర్ నిర్వీర్యం చేస్తున్నాడని తమ్మినేని వీరభద్రం ధ్వజమెత్తారు. ప్రజా వ్యతిరేక విధానాలు చేపడితే ఎవరైనా ప్రజా ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా కేసీఆర్ ఆలోచించి ఆర్టీసీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీపీఎం తరఫున ఆయన డిమాండ్ చేశారు.

భేటీ అయిన మూడుపార్టీలనేతలు

సుప్రీం తీర్పును స్వాగతించిన శరద్ పవార్

ముంబయి,నవంబర్26(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర రాజకీయాల నేపథ్యంలోఓ మరోమారు శివసేన, ఎన్సీపి కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. సుప్రీం తీర్పు నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై వీరు చర్చిస్తున్నారు. మహారాజకీయాల విషయంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ సూత్రాలను సుప్రీంకోర్టు పరిరక్షించినందుకు నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్.. న్యాయస్థానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భారత రాజ్యాంగ దినోత్సవం నాడు మహారాష్ట్ర రాజకీయాలపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడాన్ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నామని చెప్పారు. భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కు పవార్ నివాళులర్పించారు. మహారాష్ట్ర అసెంబ్లీలో బుధవారం సాయంత్రం 5 గంటల్లోపు బలపరీక్ష నిర్వహించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే ట్వీట్ చేశారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలతో రాజకీయాలపై సాధించిన విజయం ఇది అని ఆమె పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం రోజున సుప్రీం ఇచ్చిన తీర్పు మహారాష్ట్ర ప్రజలకు కానుక అని తెలిపారు. ఓపెన్ బ్యాలెట్ పద్ధతిన బలపరీక్ష నిర్వహించడం శుభపరిణామం అన్నారు. మహారాష్ట్రలో సత్యమే వర్ధిల్లుతుంది. జై హింద్, జై మహారాష్ట్ర అని సుప్రియా సూలే ట్వీట్ చేశారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బిఆర్కె భవన్‌లో ప్రమాణం చేసిన ఉద్యోగులు.

విధుల్లోకి అనుమతించని పోలీసులు

ఆర్టీసీ కార్మికుల ఆందోళన

నిజామాబాద్,నవంబరు 26 (ఆంఎన్ఎ): సమ్మె విరమణ ప్రకటనతో ఆర్టీసీ కార్మికులు విధుల్లో చేరేందుకు సంసిద్ధులవుతున్నా.. పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

డిపోల వద్ద కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. ఎవరు కూడా రావద్దని తెలిపారు. షరతుల్లేకుండా తమను విధుల్లోకి తీసుకోవాలని, వెంటనే సమ్మె విరమిస్తామని ఆర్టీసీ జేఏసీ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో ఆత్రుతగా ఎదురుచూశారు. మంగళవారం ఆయా డిపోల వద్ద చాలామంది కార్మికులు డ్యూటీలో చేరాలని నిర్ణయించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు విధుల్లో చేరాలని వచ్చినా అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో వెనుదిరిగారు. కామారెడ్డి డిపో వద్ద తమను డ్యూటీలో చేర్చుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయం ఇంకా రాలేదని, తమకు ఎలాంటి ఆదేశాలు లేవని చెప్పి పంపారు. ఇదే విషయాన్ని టీఎం యూ రాష్ట్ర కార్యదర్శి మురళి ధ్రువీకరించారు. ప్రభుత్వం వారికి ఆదేశాలు ఇవ్వకపోవడంతో తాము విధుల్లో చేరే అవకాశం లభించడం లేదని తెలిపారు.

బస్ డిపోల వద్ద పటిష్ట బందోబస్తు

తమను విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ కార్మికులు డిపోల వద్ద ఆందోళనలకు దిగారు. ఈ నేపథ్యంలో డిపోల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. డిపోల వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకుంటున్నారు. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లకు మాత్రమే డిపోల్లోకి పోలీసులు అనుమతి ఇస్తున్నారు. అన్ని డిపోల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంది.

ఆర్టీసీ కార్మికులకు చుక్కెదురు

విధుల్లో చేరేందుకు వచ్చిన వారిని అడ్డుకున్న పోలీసులు

సంగారెడ్డి,నవంబరు 26(నేటినిజం ప్రతినిధి): ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించినా విధుల్లోకి తీసుకోక పోవడం దారుణమని జెఏసి నేతలు అన్నారు. డిపోల ముందు పోలీస్ బందోబస్తు పెట్టి కార్మికులను రాకుండా చేయడం దారుణమని అన్నారు. కార్మికులను విదుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇంతకాలంగా చేపడుతున్న నిరవధిక సమ్మెను చూస్తుంటే గర్వంగా ఉందని అన్నారు. సంగారెడ్డి బస్టాండ్‌లో మంగళవారం ఆర్టీసీ కార్మికులను కలిసి పలువురు సంఘీభావం తెలిపారు. ఆర్టీసీ కార్మికులు చేసే సమ్మెకు గొప్ప విశిష్టత ఉందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సమ్మెకు మద్దతిచ్చి ప్రజా రవాణా వ్యవస్థను కాపాడుకోవాలని ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. సమ్మె విరమించకపోతే ప్రైవేట్ బస్సులను నడిపిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్,సమ్మె విరమించినా కార్మికులను బెదిరిస్తున్నారని విమర్శించారు. ఎంతో మంది ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలు అనంతరం చర్చలకు పోతే పట్టించుకోలేదని అన్నారు. ప్రత్యేక జీత భత్యాల కోసం సమ్మె చేయడం లేదని, న్యాయమైన డిమాండ్లు అడుగుతున్నారని పేర్కొన్నారు. 52 రోజుల తరువాత రాష్ట్ర వ్యాప్తంగా విధుల్లోకి చేరేందుకు వస్తున్న ఆర్టీసీ కార్మికులను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ ఆర్టీసీ కార్మికులు 52 రోజుల పాటు సమ్మెబాటపట్టారు. సమ్మెపై కోర్ట్ లో విచారణ జరుగుతుండగా..మంగళవారం నుంచి కార్మికులు విధుల్లోకి చేరాలని ఆర్టీసీ జేఏసీ నేతల పిలుపునిచ్చారు. జేఏసీ నేతల పిలుపుతో విధుల్లో చేరేందుకు కార్మికులు డిపోలకు తరలివస్తున్నారు. డ్యూటీలో చేరేందుకు వస్తున్న ఆర్టీసీ కార్మికులను పోలీసులు అడ్డుకుం టున్నారు. వామపక్షాల నేతలను ముందస్తుగా అరెస్టు చేశారు. బస్ డిపో, బస్టాండ్ ప్రాంతాల్లో భారీగా పోలీస్ బంద్ బస్తు ఏర్పాటు చేశారు. పార్టీల నేతలు, కార్మికులు అటువైపు రాకుండా బారీకేడ్లు పెట్టారు.

ప్రియుడితో కలసి వెళ్లేందుకు పన్నాగం

చనిపోతున్నానంటూ రాసిన లేఖతో కలకలం

హైదరాబాద్,నవంబర్26(ఆర్ఎన్ఎ): ప్రియుడితో కలిసి వెళ్లేందుకు ఓ యువతి ఆడిన పన్నాగం పోలీసులకు ముచ్చెమటలు పట్టించింది. ఈ ఘటన రాంగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం సృష్టించింది. లేక్‌పోలీస్, రాంగోపాల్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్లు ధనలక్ష్మి, సీహెచ్ బాబుల కథనం ప్రకారం...రాణిగంజ్‌కు చెందిన ఓయువతి (28)ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. ఉదయం తన చెల్లెలితో కలిసి ఎంఎంటీఎస్ రైళ్లలో విధులకు బయలు దేరింది. సంజీవయ్య పార్క్ దగ్గరకు రాగానే చెల్లిలికి ఓ లేఖ ఇచ్చి మధ్యలో రైలు దిగి వెళ్లి పోయింది. లేఖలో అమ్మానాన్న నన్ను క్షమించండి నేను చనిపోతున్నాను అని రాసి ఉంది.

సంజీవయ్య పార్క్ సమీపంలో నాలాలో ఓ యువతి దూకిందనే సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలం వద్దకు చేరుకొని గజ ఈతగాళ్ల సహాయంతో నాలాలో గాలించారు. అయినప్పటికీ ఫలితం లేదు. సాయంత్రం 6 గంటల సమ యంలో ఇంట్లో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను ప్రియుడితో వెళ్లి పోయిన సంగతిని తాపీగా చెప్పింది. దీంతో పోలీసులు, కుటుంబ సభ్యులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు పోలీసులు నానా హైరాన పడ్డారు. చివరకు తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిపోల వద్ద ఉద్రిక్తత!

– విధుల్లోకి చేరేందుకు డిపోల వద్దకు కార్మికులు

– అడ్డుకున్న పోలీసులు.. ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట

– తాత్కాలిక సిబ్బందిని అడ్డుకొనేందుకు యత్నం

– నిజామాబాద్ జిల్లా బోధన్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్ మృతి

– గుండెపోటు రావటంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయిన రాజేందర్

– ఖమ్మంలో బిల్డింగ్ ఎక్కి నిరసన వ్యక్తంచేసిన మహిళా కార్మికులు

హైదరాబాద్, నవంబర్26(ఆర్ఎన్ఎ) : తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ డిపోల వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. కార్మికులు విధుల్లోకి వెళ్లేందుకు తెల్లవారు జామునే డిపోల వద్దకు చేరుకున్నారు. దీంతో అప్పటికే పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకోని దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాటలు చోటు చేసుకున్నాయి. తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు సమ్మె విరమించి, విధుల్లోకి చేరేందుకు డిపోల వద్దకు వెళ్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకుంటున్నారు. ఆర్టీసీ యాజమాన్యం అనుమతి లేనందున విధుల్లో చేరడం కుదరంటూ కార్మికులను వెనక్కి పంపివేశారు. ఇదిలా ఉంటే మంగళవారం రాత్రే పలువురు జేఏసీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డిపోల వద్దకు చేరుకున్న కార్మికులు.. తాత్కాలిక కండక్టర్లను, డ్రైవర్లను అడ్డుకుంటున్నారు. దీంతో పోలీసులు కార్మికులను అరెస్ట్ చేశారు. పోలీసులకు, కార్మికులకు మధ్య తోపులాట జరిగాయి. కరీంనగర్ డిపో వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. విధుల్లో చేరేందుకు వచ్చిన ఆర్టీసీ కార్మికులను పోలీసులు అరెస్ట్ చేశారు. కార్మికులకు మద్దతుగా వచ్చిన సీపీఐ కార్యకర్తలను సైతం అదుపులోకి తీసుకున్నారు. విధుల్లో చేరుందుకు వచ్చిన సంగారెడ్డి కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కామారెడ్డి డిపోలోకి ఆర్టీసీ కార్మికులు దూసుకువచ్చారు. తమను విధుల్లోకి చేర్చుకోవాలంటూ అధికారులలో వాగ్వివాదానికి దిగారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 100 మంది కార్మికులతో పాటు మహిళా కండక్టర?లను అరెస్ట్ చేశారు. నిజామాబాద్ -1 డిపో వద్ద విధుల్లో చేరేందుకు వచ్చిన ఏడుగురు ఆర్టీసీ కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమను విధుల్లోకి తీసుకోవాలని కార్మికులు వేడుకున్నారు. కేసీఆర్‌కు దండం పెడుతున్నాము..దయచేసి మమ్మల్ని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. తమ ఇళ్లల్లో ఆర్థిక పరిస్థితులు బాగాలేవని, కుటుంబ పోషణ కూడా కష్టంగా ఉందంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విధుల్లోకి చేరడానికి ఆర్టీసీ కార్మికులు ర్యాలీగా బయలుదేరి డిపోలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకొని ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. ఈ తరుణంలో పోలీసులకు, ఆర్టీసీ కార్మికుల మధ్య తీవ్ర తోపులాట, వాగ్వాదం జరిగింది. కార్మికులను పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్న వాహనాన్ని మహిళా కండక్టర్లు అడ్డుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా డిపోల వద్ద ఉద్రిక్తత నెలకొంది. విధుల్లోకి చేరేందుకు కార్మికులు అన్ని డిపోలకు వెళ్లారు. డిపో లోపలికి వెళ్లేందుకు యత్నించిన కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. 23మంది కార్మికులను అరెస్ట్ చేశారు. నాగర్ కర్నూల్, కల్వకుర్తి డిపోల వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. నారాయణ పేట డిపోవద్ద ధర్నాకు దిగిన కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాత్కాలిక సిబ్బందితో బస్సులను నడిపిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం డిపో వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. డిపోకి చేరుకున్న కార్మికులు.. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లను అడ్డుకున్నారు.

దీంతో కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డిపో వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. నల్గొండ జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల వద్ద పోలీసులు భారీగా మోహరించారు. నార్కట్‌పల్లి, దేవరకొండ కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సూర్యాపేట, కోదాడ ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేశారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. సంగారెడ్డి డిపో వద్ద విధుల్లోకి చేరేందుకు యత్నించిన కార్మికును పోలీసులు అరెస్ట్ చేశారు. సిద్దిపేట డిపో వద్ద పోలీసులకు, కార్మికుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. విధుల్లోకి చేరేందుకు వచ్చిన కార్మికులను పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేశారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ ఆర్టీసీ డిపో వద్దకు పోలీసులకు, కార్మికుల మధ్య తోపులాట జరిగింది. విధులకు హాజరవుతామంటూ కార్మికులు డిపోలోకి చొచ్చుకొచ్చారు. తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదంటూ అధికారులు వారిని విధుల్లోకి తీసుకోలేదు. దీంతో వారు అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు అడ్డుకొని కార్మికులు అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం జిల్లాలో కార్మికులు డిపోల వద్దకు చేరుకొని తమను విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. పలువురు ఆర్టీసీ మహిళలు బిల్డింగ్ ఎక్కి తమను విధుల్లోకి తీసుకోవాలని లేకుంటే బిల్డింగ్ ఎక్కి దూకుతామని బెదిరించారు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారికి నచ్చజెప్పి కిందకు దింపారు.

గుండెపోటుతో రాజేందర్ మృతి..

తెలంగాణవ్యాప్తంగా డిపోల వద్దకు చేరుకున్న కార్మికులు తమను విధుల్లోకి చేర్చుకోవాలని వేడుకుంటున్నారు. ఉద్యోగం కోసం కంటతడి పెడుతూ.. కార్మికులు పలుచోట్ల ప్రభుత్వాన్ని, అధికారులను ప్రాధేయపడుతున్నారు. డిపోల మందు ఆందోళన చేస్తున్నారు. వారిని పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌లకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో పలుచోట్ల విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. నిజామాబాద్ జిల్లా బోధన్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజేందర్ (55) గుండె పోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సమ్మెవిరమించినా ప్రభుత్వం తిరిగి ఉద్యోగంలోకి తీసుకోకపోవడంతో రాజేందర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారని, ఈ క్రమంలో ఇంటివద్ద ఉన్న ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు వచ్చిందని, వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా లాభం లేకపోయిందని, గుండెపోటుతో రాజేందర్ మృతి చెందారని కార్మికులు తెలిపారు. రాజేందర్‌ది నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం మంగల్‌పాడ్ గ్రామం.

కశ్మీర్ లోయలో రైలు సర్వీసులు పునఃప్రారంభం

శ్రీనగర్: కశ్మీర్ లోయలో రైలు సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. బారాముల్లా-బనీహాల్ ప్రాంతాల మధ్య మొత్తం 138 కిలోమీటర్ల ప్రయాణమార్గం అందుబాటులోకి వచ్చింది. రైల్వే పోలీసుల భద్రతా పర్యవేక్షణల అనంతరం అధికారులు రైలు సర్వీసులను పునఃప్రారంభించారు. కశ్మీర్ లోయలో శీతాకాలం సమయంలో దట్టమైన మంచు కురవడం కారణంగా రహదారి ప్రయాణాలకు తరచుగా ఆటంకాలు ఏర్పడుతుంటాయి. రైలు సర్వీసు అందుబాటులోకి రావడంతో స్థానికంగా ఉన్న వేలమందికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఈ నెల 7వ తేదీన కురిసిన దట్టమైన మంచుతో రైలు పట్టాలపై 20 నుంచి 45 సెంటీమీటర్ల మేర మంచు పేరుకుపోయింది. సహాయక సిబ్బంది పట్టాలపై మంచును క్లియర్ చేశారు. శ్రీనగర్-బారాముల్లా, శ్రీనగర్-బనిహాల్ మార్గాల్లో రైలు సర్వీసులను ప్రారంభించారు. ఈ మార్గాల్లో ఇప్పటికే 16 రైలు సర్వీసులు ఈ మార్గాల్లో ట్రయల్ రన్స్ సైతం పూర్తయ్యాయి. మొత్తం నడుస్తున్నాయి.

అదనపు కట్నం కోసం వేధింపులు

వివాహిత ఆత్మహత్య

హైదరాబాద్,నవంబర్26(ఆర్ఎన్ఎ): అదనం కట్నం కోసం భర్త వేధింపులు తాళలేక.. పెండ్లి అయిన ఏడు నెలలకే యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ములుగు జిల్లా జాకారం మండల కేంద్రానికి చెందిన సామల కుమారస్వామి కూతురు సుస్మిత(19)ను పీర్జాదిగూడ మల్లికార్జున్‌నగర్ కాలనీకి చెందిన కోరయ్య కుమారుడు విజేందర్‌కు ఇచ్చి మేలో వివాహం చేశారు. కాగా.. విజేందర్ కొన్ని రోజులు అదనపు కట్నం కావాలని భార్యను వేధిస్తున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుస్మిత రాత్రి బెడ్ రూంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసు లు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కాగా.. తన కూతురు మృతికి కారణం అల్లుడి వేధింపులేనని మృతురాలి తల్లిదండ్రులు పోలీసుకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నింగిలోకి పీఎస్ఎల్‌వీ సీ -47

– శ్రీవారిని దర్శించుకున్న శివన్

చిత్తూరు, నవంబర్26(ఆర్ఎన్ఎ) : తిరుమల వెంకటేశ్వర స్వామివారిని ఇస్రో చైర్మన్ శివన్ దర్శించుకున్నారు. మంగళవరాం ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. పీఎస్ఎల్‌వీ -సీ47 వాహకనౌక సమూనాను శ్రీవారి పాదాల చెంత ఉంచి స్వామివారి ఆశీస్సుల పొందారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఈసందర్భంగా శివన్ మాట్లాడుతూ.. బుధవారం ఉదయం 9.20గంటలకు పీఎస్ఎల్‌వీ సీ -47 ప్రయోగించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో స్వామివారి ఆశీస్సులు పొందేందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉంటే బుధవారం చేపట్టనున్న పీఎస్ఎల్‌వీ సీ-47 ప్రయోగానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. మంగళవారం ఉదయం 5 గంటల 28 నిమిషాలకు ప్రారంభమైన ఈ కౌంట్‌డౌన్ 26 గంటలపాటు కొనసాగనుంది. బుధవారం ఉదయం 9.28 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్‌వీ సీ-47ను నింగిలోకి పంపనున్నారు. ఈ రాకెట్ ద్వారా 714 కిలోల బరువు కలిగిన కార్టోశాట్-3 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. అలాగే అమెరికాకు చెందిన 13 కమర్షియల్ నానో ఉపగ్రహాలు రోదసిలోకి పంపించనున్నారు. ఇందులో 12 సీఎల్ఎస్‌వి-4పీ అనే బుల్లి ఉపగ్రహాలు, మెష్‌బెడ్ అనే మరో బుల్లి ఉపగ్రహం ఉండనుంది. ఇది షార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 74వ ప్రయోగం. పీఎస్ఎల్‌వీ సీ-47 ప్రయోగం నేపథ్యంలో ఇస్రో చైర్మన్ శివన్ మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. పీఎస్ఎల్‌వీ సీ-47 ప్రయోగం విజయవంతమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఖమ్మంలో ఉద్రిక్తత

ఆర్టీసీ కార్మికులను రానీయని పోలీసులు

ఖమ్మం,నవంబరు 26(ఆర్ఎన్ఎ): 52 రోజుల తరువాత రాష్ట్ర వ్యాప్తంగా విధుల్లోకి చేరేందుకు వస్తున్న ఆర్టీసీ కార్మికులను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ ఆర్టీసీ కార్మికులు 52 రోజుల పాటు సమ్మెబాటపట్టారు. సమ్మెపై కోర్ట్ లో విచారణ జరుగుతుండగా..మంగళవారం నుంచి కార్మికులు విధుల్ల